గాలమాహాత్మ్యంబు కారణముగను.
కలరు కొందఱు విప్పకను లర మోడ్చి,
చిలుకలవలె నెప్డు తెలివేమి లేక,
తిత్తియూఁదెడువానిఁ దిలకించి కూడ
నొత్తి బిగ్గర నవ్వుచుండెడివారు;
కుంభినిపై మఱి కొందఱు గలరు
గాంభీర్య శాలి యన్ గణన గన్నట్టి
యల నెస్టరంతటి యనఘుఁడు వచ్చి,
పలుకఁబడిన హాస్యవచనంబునకును
దగును నవ్వఁగ నని తా నొప్పుకొన్నఁ,
దెగువమైఁ బెదవులు తెరచి యొకింత
నవ్వక, వికృతంపునటనల మోము,
క్రొవ్వెసంగ, ముడుచుకొని యుండువారు.

[బస్సానియో, లోరెంజో, గ్రేషియానో, ప్రవేశించు చున్నారు.]

సోలా——వచ్చుచున్నాఁడు నీబంధు వౌ ఘనుఁడు
మెచ్చి 'బస్సానియో' మిత్రు లైనట్టి
'గ్రేషియానో'ను, 'లోరెంజో'ను గలిసి
భాషింప వరసఖుల్ వచ్చిరి కాన,
సెలవు గైనియెద నెలమి మేమిపుడు.
శాలా——విలువ హెచ్చుగఁ గల చెలులురాకున్న,
నీవు సంతోషంబు నెలకొన్నదాఁక
నీకడనే నిల్చి నే నుందు సుమ్మి.
ఆంటో——చెలికాఁడ! మఱి నీదువిలువయుఁగూడ
వెల లేనిదె సుమ్ము విను నామతమున

వేఱేదియో నీకు వెళ్ళకుండంగఁ
దీఱనిపని యుండి, దీనిని సందు
కావించుకొని యేగఁ గాంక్షింతు వనుచు,
భావించెదను నేను వాస్తవంబుగను.
శాలా——అరుగ, నోప్రభులార ! ఆజ్ఞ యిచ్చెదరె ?
బస్సా——మరల నేకంబుగా మనమెల్ల నెపుడు
కూడి, చెప్పుడు మీరు, కూరిమి మీఱ
వేడుకతోఁ బ్రొద్దు వెళ్ళింపఁ గలము.
ఇట్లు మీరంతంత కెరవగు చుంటి,
రట్లాట న్యాయమే యరయంగ మీకు?
శాలా——చిత్తము. తీఱిక చేసికొంచొకట
వత్తుము మిముఁగూడి పలుకు లాడంగ.

[శాలారినో, సోలానియో, వెళ్ళుచున్నారు.]

లోరెం——'అంటోనియో' తోడ నమరంగ నిన్ను
జంటగఁ గూర్చుట సమకూఁడె గాన,
'బస్సానియో' ప్రభూ ! వదలి నన్నిచట
లెస్స మే మెందేని లీలఁ బోయెదము.
కాని, భోజనవేళఁ గలయంగవలయు
స్థానంబు, దయచేసి తలఁపున నిలుపు.
బస్సా——కలిసికొందును మిమ్ముఁగని తప్పకుండ.
గ్రేషి——కలదె, 'యాంటోనియో !' కారణ మొకటి ?
కనఁబడెదవు, నీవు కళదప్పినట్లు.
వినుము నీ వీ లోకవిషయంబులందు
నతికాంక్షతో నుందు వనవరతంబు.

మతి నెప్పుడుఁ బ్రపంచరతు లగువట్టి
వారు సుఖంబును బడయంగ లేరు.
నీరూప మదియేమొ నిజముగా మాఱె.

ఆంటో.——ఎట్లు చూడఁ దగునో యీప్రపంచంబు
నట్లె చూచుచునుందు ననయంబు నేను.
సమబుద్ధిఁ జూడ నీవిశ్వమండలంబు
రమణీయనాటకరంగంబు సుమ్ము;
ఎల్లవారును దమ కేర్పడ్డకథను
జెల్లును వినిపింపఁ జెడని వేషముల;
కలయు దుఃఖకరంపుఁగథ వినిపింప
వలయువంతిప్పుడు పడియె నాపాల.

గ్రేషి.——పరిహాసకుని వేషభావలు నేను
ధరియించి యానందభరితుండ నగుచు
ముదిమి వచ్చెడుదాఁకఁ బుత్తుఁగాలంబు
మదిచింత మూల్గుచు మఱుఁగుటకంటె
హాయిగాఁ దినిత్రాగి యలరుచునుందు.
కాయమునను శక్తి గలయట్టినరుఁడు,
ఱాతిపై మలఁచినతాతను బోలి,
రోఁత పుట్టఁగను గూర్చుండంగ నేల!
ఏల నిద్దురమబ్బు మేలుగొన్నపుడు!
మాలిమిఁ బనిలేక మటమట మనుచుఁ
గామలరోగంబు గాంచంగ నేల?
నీమీఁద నాకెంతొ ప్రేమంబు గలదు;
ఆప్రేమయే నన్ను నదనఁ బ్రేరేఁచె

నీప్రకారము నీకు హితమును జెప్ప
తెలియఁజెప్పెద, నీవు తిన్నఁగావినుము ;
నిలుకడగా నీరు నిలుచుటఁజేసి
పాఁకుడుపట్టు తటాకంబుఁ బోలి,
పైకి ముఖంబున వైవర్ణ్య మడరఁ,
బుడమి లోకులు తమ్ము బుద్ధిమంతులఁగఁ
గడు వివేకంబును గలవారిఁ గాఁగ
గాంభీర్యశాలులఁ గాఁ జెప్పుకొనఁగ,
డంభపుమానంబుఁ దమయంతఁ దాల్చి
'నావాక్యమే యెందు దేవవాక్యంబు
గావున, నామాట కేవారు నెదురు
చెప్పఁగూడ దనెడి చిఱువాక్యమునె
యెప్పుడు గారవ మిలఁ బొందవలయు
తరగతిలోఁ జేరు నరులును గలరు.
నిరతము మౌనంబు ధరియించినట్టి
హేతువుచేతనే యిట ధీరు లనుచు
ఖ్యాతిఁ జెందుచునున్న ఘనుల నెందఱినొ
యెఱుఁగుదు నేనును; మఱి యట్టివారు
వెఱవక తమనోరు తెఱచి మాటాడ
నెన్నఁడేనిఁ దెగింప రించుకలోన;
మున్ను త మ్మింతయు మన్ననఁ జూచు
పటుమతు లగుమిత్రవరులవీనులకె
కటువులుగా నుండిఁ కలిగింప వ్యథను,
బిచ్చివారని వారు పిలువకపోరు.

వచ్చి యింకొకసారి యిచ్చట నీకు
నీవిషయమె చాలనెఱిఁగింతు నేను.
నీవిటు చింతనా నెగడు గాలమున
జడు లిచ్చుఖ్యాతి యన్ చెడుచేఁపకొఱకు
నెడఁదయుక్ కోలఁకుము గదుఁ గలంపకుము—
రారమ్ము పోదము, లోరెంజా; మనము—
కోరెద సెలవిమ్ము కొంచెము సేపు;
నడిచి యిప్పుడె భోజనము చేసివచ్చి
కడముట్ట హితబోధ కావింపఁ గలను.

లోరెం—చనెదము భోజనసమయంబుదాఁక
నినువిప్పఁ డిచట మీ నెలవున విడిచి
'గ్రేషియానో' యెందుఁ గించిత్తు నన్ను
భాషింప నీయఁడు, పదిగ నల్లాట
పతఁడిష్డ వర్ణించినట్టియామూఁగ
మతిమంతులం దొక్కమాన్యుండ నాదు.

గ్రేషి——సహవాస మొక రెండు సంవత్సరములు
మహిమీఁదఁ జేయుము మఱియు నాతోడ,
నీవు వినక యుందు నీనోటిమాటె.

ఆంటో—నేవక్త నయ్యెద నీనిమిత్తంబు;
మంచిది యిప్పుడు మఱిపోయిరండి.

గ్రేషి—మంచిమాటంటివి, కాంచు వందనము
మానంబు తగు, నోరులేని పశులకుఁ
బైనింక నాథుఁ డబ్బనికన్యలకునె.

[గ్రేషియానో, లోరెంజో వెళ్ళుచున్నారు.]

ఆంటో—ఇతనిమాటల యుక్తియేమైనఁ గలదె?

బస్సా—ఇతఁడు 'వినీసు'లో నెల్లరకంటె
నధికంబుగ నిరర్థకాలాపములను
వృథవచింపుచునుండు ; వివరించిచూడ
గంపెడుపొల్లులోఁ గలసి లోపలను
నింపుగా వరిగింజ లెంచేని రెండు
గలమాడ్కి నితని వాక్యంబులలోనఁ
గలుగును యుక్తియుక్తములైనవియును
గనుఁగొన వానిని దినమెల్ల బట్టు;
కనుగల్గి శోధించి కనుఁగొంటిమేని,
పడినశ్రమమునకుఁ బ్రతిఫల మింత
పడయంగఁ జాలము వాస్తవముగను.

ఆంటో—ఏసతిగృహమున కిఁకరహస్యముగ
నాసమై యాత్రచేయంగను నీవు
మ్రొక్కికొనితివో యామద్దియపేరు
నిక్కంబుగాఁ జెప్పు ; నీవీదినంబు
తప్పక చెప్ప వాగ్దానంబు నాకు
నప్పుడె చేసి యున్నాఁడవు కాదె?

బస్సా—ఆయుంబు గనిపెట్టి యర్హమౌ వ్యయము
చేయుటకునుమాఱు, చేతికోలంది
ధనము వెచ్చించుచు డంభము పూని
ఘనుఁడని జనులచే ననిపించుకొనఁగ
స్థిరమైన యట్టినాస్థితిని నేనెట్లు
గురుకొని చెడఁగొట్టుకొంటినో నీకు

సకలంబు తెలిసినసంగతి గాదె!
వికలత్వ మొందదు వినుము నామనసు,
మునుపటివలె వ్యయ మొనరింప నిపుడు
పనికిరానియవస్థ ప్రాప్తమాటకును,
ఇప్పుడు నాకున్న యెదచింతయెల్ల
నప్పు డతివ్యయ మరయక చేసి
తెలివిలేమిని బైకిఁ దెచ్చుకొన్నట్టి
పలుఋణములనుండి బయలఁ బడంగఁ
న్యాయమార్గముచేత నాకెట్టు లోదవు
నోయని కాని, వేఱొక్కటి కాదు.
ధనముచేతఁ బ్రేమచేతను మున్న నీకు
ఋణపడియున్నాఁడ నెంతయు నేను
నామీఁద నీకున్న ప్రేమను బట్టి
యేమాడ్కి నాయప్పు లెల్లను దీర్పఁ
దలఁచినాఁడనో నేను; దానికి నాకుఁ
గలయూహ లాధారములుఁ బూర్తిగాను
మదివిప్పి నీతోడ మఱిచెప్పి నాదు
హృదయంబుబరువెల్ల నే దించుకొందు.

ఆంటో—చెలికాఁడ! సర్వంబుఁ దెలుపుమి నాకు
చెలఁగి నీవెప్పుఁడు చేసెడుకరణి
నది గౌరవావహమైనదే యైన.
ముదమున నాయర్థమును శరీరంబు
తక్కిన సర్వసాధనములు నావి
యక్కఱను నీకు ననుకూలపడఁగ

నీయధీనంబులు నేఁ జేయువాఁడ;
వేయేల! నాయెడ విశ్వాస ముంచు

బస్సా—బాలుఁడ నయి పాఠశాలనుజదువు
కాలంబునను నేను గడు వేడ్క మీఱ
విలువిద్య గఱచుచు విడిచినబాణ
మిలఁబడి కనఁబడ కెందేని నడఁగ,
మఱియొక బాణంబు గుఱివెట్టి తొంటి
తెఱఁగున నాదిక్కె తిన్నఁగా వదలి
శరపాత మగుచోటు శ్రద్ధతోఁ జూడ,
దొరకును దఱచుగాఁ దూపులు రెండు
చిన్నప్పటి దగునాచేష్టను బోలి
నిన్ను వేఁడఁగఁ బోవుచున్న సాయమును
దుష్టంబు కానిదై తోఁచును గాన
దృష్టాంతముగ దానిఁ దెచ్చుచున్నాఁడ
కడు నీకు నే ఋణపడి యున్నవాఁడ
నెడఁద నప్పునుదీర్ప నిచ్ఛించు పేద
బాలునిగతి సంభవం బయి యిపుడు
పోలఁగా నష్టమైపోయె నాయప్పు
సదయుత నింకొక్కసారి యొకమ్ము
మొదల వేసినయట్లు వదలెద వేని,
ఘనతరజాగ్రత్తఁ గనిపెట్టియుండి
కొనితెత్తు రెంటిని గూడ నే వెదకి;
ఒకవేళఁ దేలేక యుండితి నేని
సకలవిధంబుల సాధించి తెచ్చి.

కడదాని నర్పించి, కడమదానికయి
యెడఁ గృతజ్ఞుఁడ నయి ఋణపడియుందు.

ఆంటో—ననుజక్కఁగా నెఱిఁగినవాఁడవయ్యు
బనికిమాలిన దీర్ఘ వర్ణనలంటు
దిగి కాలమును వ్యర్థముగను బుచ్చెదవు.
తనమిత్రుని వాంఛితము దీర్చుకొఱకు
నిర్విచారముగ నేనిత్తునా లేవా
సర్వస్వమునునంచు సందేహపడుచు,
నాసొత్తునెల్ల దుర్ణయమునఁ బాడు
చేసినంతటికంటెఁ జింతాతిశయముఁ
గలిగించు చున్నావు కరమును నాకు
చెలికారమును నెంచి చెచ్చెరఁ జెప్పు
నాచేత నగునని నమ్మకముగను
నీచిత్తమందును నీవెంచినట్టి
పని దేని నైనను బఱుగునఁ జేయఁ
గసిపెట్టి సిద్ధముగా నున్నవాఁడ.

బస్సా——కలదు 'బెల్మొంట'ను గ్రామంబునందు
జలజాక్షియొక్కతె సౌందర్యరాశి,
'సౌందర్య' మనుమాట చాల దాయింతి
యందమ్ముఁ దెలుపంగ నావంత యేని;
ధనవంతురా లామె గుణవంతురాలు
మును గొన్నివేళల ముదమొప్పఁ దనదు
కనుదామరలనుండి కరుణమై నాకుఁ
బనిచెను ధ్వనిలేని వర్తమానముల.

ఆమె నామము 'పోర్ష్య' అరసిచూడంగ
నేమిటఁ గొఱవడ దించుకయేని,
కేటోకుఁ గూఁతురై మేటి యైనట్టి
'బ్రూటసు' భార్యయా 'పోర్ష్య' యన్ సతికి
మృగనేత్రమహిమంబు మితిలేనయట్టి
జగమెఱుంగనిది లేశంబును గాదు;
ఆమెను జేపట్ట నాత్మలఁ గోరి
కాముకజనులు నల్గడలయందుండి
పలుసుప్రసిద్ధులుఁ వచ్చుచు నుండ్రు
తళతళలాడెడి తరుణిముంగురులు
కనకకేశంబులకాంతిని బూని
కణతలపై వ్రాలి, ఘనతఁదా నున్న
'బెల్మొంటు' గ్రామంబుఁ బెను 'కాల్చిసు' నగ
మేల్మిఁ జెందింపంగ, మెచ్చికరంబు
చేరుదు రచ్చోటు 'జేసను' వంటి
వార లనేకులు వామాక్షి కొఱకు
ఉరవుగా వారిలో నొకరితో నైన
సరి దూఁగఁ జాలెడుసాధన మున్నఁ
గాంతను దప్పక కైకొనఁ గల్గు
నంత మహాదృష్టవంతుఁడ నౌదు
నని నిశ్చయంబుగ ననఘుండ! యిపుడు
ఘనమైన నమ్మిక కలదు నామదిని,

ఆంటో—ఈయెడ నాధనమెల్లను జలధి
నే యున్నదని నీవెఱుఁగుదు కాదె!

రొక్కమొండెను, నట్టిరొక్కంబుఁ గూర్ప
నిక్కడ సరకొండె నిప్పుడు లేదు;
కావునఁ, బురిలోనఁ గలయంగఁ దిరిగి
యావు విచారింపు మెంత ఋణంబు
పుట్టఁగలదొ నన్నుఁబట్టి యీక్షణము;
గట్టిగా నానమ్మకంబెల్ల నిందు
వినియోగ పఱిచెద, 'బెల్మంటు' నకును
జని నీవు ఘనతతో సాధ్వి వరింపఁ
దగి యుంటకయి పట్టు ధనము నిప్పింప
తగుధన మెవ్వరిదగ్గఱఁ గలదొ
సరగునఁ గనుఁగొని చనుదెంచి చెప్పు;
అరిగెద నిపుడేను నాపనికొఱకె
నా పేరిటను గాని నాకున్నయట్టి
యాపలుఁవస్తుసంహతిమీఁదఁ గాని,
వలసినధనమును బడయుట కేను
గలలోను వెనుదీయఁ గలవాఁడఁగాను.

(అందఱు నిష్క్రమించిరి)

౨. రంగము—బెల్మంటుగ్రామము
పోర్షియగృహమునందలి గది

[పోర్షియ, నెరిస్సా ప్రవేశించుచున్నారు]

పోర్షి—నాయల్ప దేహంబు, నాతిరో! వినుమి,
నాయాన యిపు డీఘనప్రపంచంబు
తోడను విసు గొందె. తొట్రిలఁ జొచ్చె

నెరి—చేడియరో! నిన్నుఁ జేరియున్నట్టి
మితిమీఱుపటుసౌఖ్యవితతులయట్ల
యతికష్టములు వచ్చి యలయించు నేని,
విసుగుపుట్టఁగ వచ్చు విశ్వంబుమీఁద.
వసుమతిపై నొక్కవింతను జూతు
నది యేమొకో కాని యాహారమునకు
మొదలె యేమియు లేక పదిగఁబస్తుండు
కడుపేద లెట్లో యాకై వడి గానె
కడువెక్కసంబుగఁ గుడుచువారలును
బాధితు లగుచుంద్రు వ్యాధులచేత.
ఈధాత్రి నటుగాన నెంతయు సుఖులు
సతతంబు మధ్యమ స్థితి నుండువారె.
అతిధనవంతు లెం దల్పాయువు లయి
తెగు చుందు, రటు గాక దీర్ఘాయువులుగఁ
దగుపాటిస్థితిమంతు లగుదు రెల్లెడల.
పోర్షియ—పడఁతుకరో! నీతివాక్యంబు లహహా!
కడు నింపుగాఁ జెప్పఁబడియె నియ్యెడను.
నెరి—ఇంత కంటెను నవి యింపుగానుండుఁ
గాంత! యనుసరింపఁగాఁ బడు నేని
పోర్షియ—ఇదిమంచిపనియని యెఱుఁగుట వోలె
నది చేయుటయుఁగూడ నవనిలో నంత
సులభమే యౌనేని, యిలమీఁదఁ గల్గు
పలుచిన్నగుడులెల్ల బహువిశాలంబు
లయినట్టిదేవాలయంబులు గాఁ గఁ,

గుయి వెట్టుబీదలగుడిసె లన్నియును
స్థిరములౌ రాజమందిరములు గాఁగ,
నరయఁగ నెల్లెడ నయియుండుఁజుమ్ము
తనచేయు నుపదేశమును బట్టి నడుచు
కొనువాఁడు దేవుఁడేయని చెప్పవచ్చు;
నే నుపదేశించు నీతులఁ గ్రమము
గా నాచరింపంగఁ గలవారిలోన
నొక్క తెనయి నైన నుండుటకంటెఁ
జక్కనిసద్ధర్మసమితిని నేను
గరమును సులభంబుగా నన్యజనుల
కిరువదిమందికి నెఱిఁగింపఁ గలను
ఇద్దర మనయింద్రియోద్ధతి నణఁప
బుద్ధిచే శాసనములఁ జేయ వచ్చు
కాని, యవ్వాని కాగ్రహగుణమింత
యేనియు లోఁబడ కెగసి లంఘించు
బలహీన మానట్టివలఁ ద్రెంచుకొంచు
వెలి దూఁకు శశకంబువిధమును బూని,
మతిహీనుఁ జడనఁ నువమాణవకుండు
హితబోధన గణింప కెడగాను దాఁటు
కాని, యీవిధవాద మేను జేయంగఁ
బూనుట, నాయంతఁ బురుషుని నేనె
వరియింప వలె ననువాంఛతోఁ గాదు
వరియించుటా! యెంత భాగ్యంబె నాకు!
నే నిష్టపడునట్టివాని వరింపఁ

గా నొండె, నిష్టంబు లేనట్టివాని
వరియింప గోర్కుట వలదంట కొండె,
వరయు నేను స్వతంత్రురాలను గాను;
మరణమొందినతండ్రి మతివ్రాసిచనిన
మరణశాసనమున మగిడింపఁబడుచు,
బ్రతికియున్న కొమార్తెపటుమానసంబు
వదలనిపెనుకట్టుబాటున నుండె;
కాంచియొక్కని వరియించుట కొండె
మించి యేరి నిరాకరించుట కొండెఁ
జాలనిదశ నాకు సంభవం బగుట
చాలఁగష్టము గాదె? చానరో! చెపుమ.
నెరి—పుడమి నీజనకుండు పుణ్యాత్ముఁడెంతో;
గడుపుణ్యు లవసాన కాలంబునందు
నలరు చుందురు దేవతావేశమునను;
కలికిరో! యటు గానఁ, గ్రమముగాఁబసిఁడి,
వెండిని; సీసంబుఁ బెట్టి చేయించి
యుండినపెట్టెల నొకదానిఁ దనదు
సంకేతమునుబట్టి సరియైనదానిఁ
గొంకు చెందక కోరుకొన్నట్టివాఁడె
యిల నీకు భర్త కాఁగలవాఁ డటంచు
సలిపిననీప్రియజనకుప్రతిజ్ఞ
కారణంబున మూఁట గ్రమమైన పెట్టెఁ
గోరుకొనెడువాఁడు కూర్మి నీమీఁదఁ
దప్పక కలవాఁడు తప్ప వేఱొక్కఁ

దెప్పుడుఁగా నేరఁ డిది నిశ్చయంబు.
ఐన నిప్పుడు నిన్ను నాశ్రయింపంగఁ
బూని వచ్చినరాజపుత్రు లైనట్టి
కాముకవరులపైఁ గలయట్టి నీదు
ప్రేమ తెలియంగను జేర్వేరఁ జెపుదె!

పోర్షి— వారి నామంబులు వరుసతోఁ జెప్పు;
వారివారిగుణానువర్ణనం బేను
జేసెదఁ బేళ్ళవు చెప్పుచు రాఁగ.
చేసెడువర్ణనవాసిని బట్టి
యెవ్వరెవ్వరిమీఁద నెంతెంతప్రేమ
నివ్వటిలునో నాకు నీవెఱింగెదవు.

నెరి— వారిలోఁ దొలుదొల్త వచ్చువాఁడు
పేరగు 'నేపల్సు' పృథ్వీశసుతుఁడు.

పోర్షి— అతఁడు తలంపఁగ నశ్వాలోలుండు
సతతంబు జనవాజిసంగతి తప్ప
మఱి యొకవిషయంబు మాటాడఁ డెపుడు.
తఱుచుగాఁ జెప్పను దనగుఱ్ఱమునకుఁ
దానె లాడము గట్టఁ దగువాఁడనంచుఁ
బూని ప్రతిష్ఠగ బుద్ధిహీనతను
అమ్మాటనుబట్టి యాతనితల్లి
కమ్మరవానికిఁ గనెనేమొ యతని
ననుచు సంశయ మయ్యెడును నాకుఁ జాల

నెరి— వెనుకను 'పోలండు' జనపతి గలఁడు

పోర్షి— మొకము చిట్లించుట యొకటి తక్కంగ

వకట ! వేరొకపని యతనికి లేదు
'నను గోరవేని, నన్యునిఁ గోరుకొమ్మి'
యని చెప్పునట్లుండు నతనిముఖంబు,
నవ్వు·వచ్చెడికథల్ నెవ్వడి వినుచు
నవ్వనపాపంబునను బోవఁ డెపుడు
తనపూర్ణ యౌవనదశయందె యిట్లు
పనిలేనిచింతలో మునిఁగి యున్నతఁడు
వయసు మీఱు గొలంది, వ్యసన ప్రధానుఁ
డయిన యీపండితుఁ డగు నేమొ చూడ
ఈయిరుపురలోన నెవ్వని నైన
న్యాయంబుగ వివాహమాడుటకంటె,
ఎముక నోరను బూని యెసఁగెడునట్టి
యముని నైనను బెండ్లియాడఁ గాంక్షింతు.
వీర లిద్దఱచేతఁ జేరక యుండ
వారించుఁగాత నన్వడిగ దైవంబు

నెరి—వెలఁది ! యేమనెదవు 'ఫ్రెంచి' రాజైన
యుల 'లిబా' ననియెడు నాతనిఁగూర్చి?

పోర్షియ—దేవుఁడు మానవదేహంబు నందుఁ
గావించె నాతనిఁ గాఁబట్టి యతని
మనము గణింతము మనుజునిగాను
వినుము నే నెఱుఁగుదు విస్పష్టముగను
బరిహసించుట గొప్పపాతకమంచు
అరయంగ 'నెపల్సు' నరనాథుకంటె
నితఁడు తురంగమతతులలో మెలఁగ

నతిఘనుం డననొప్పు; నంతియకాక,
యనుపమానగుణాఢ్యుఁ డాస్యంబు మాడ్చు
కొనుటలోఁ బోలండు' మనుజేంద్రు కన్న
తఱుచుగా నరులెల్లఁ దానె యాఁగాని
మఱి వేఱె తానొక్క మనుజుండు గాఁడు
ఒకపక్షి పాడిన; నొగి నందుకొంచుఁ
దక తక మని లేచి తాండవ మాడు;
తననీడతోడనే తగ సాము చేయు,
విను మాతనిని భర్తఁ గను జేసికొన్న,
నిరువదిమందికి నిల్లాల నయిన
కరణి యగును జుమ్ము కాంత! నాబ్రదుకు.
నను దిరస్కారంబునను గోరఁడేని,
కనుఁగొని యాతని క్షమియింతు నేను;
విను మంతయే కాని, వెఱ్ఱిమోహమున
నను నాతఁ డత్యంతమును గోరు నేని,
బదులు మోహించి యవ్వానివై నేను
సదయత వహియింపఁ జాల నెన్నటికి.

నెరి—ఏవాక్యమును బల్కె 'దింగ్లాండు' లోని
ఙ్మావరసుతుఁడు 'ఫోల్కన్ బ్రిడ్జి' గూర్చి!

పోర్షి—ఈవ యెఱుఁగుదు నే నీతనిగూర్చి
యేవాక్యమును వచియింప లేకుంట
తెలియ వాతఁడు పల్కు పలుకులు నాకుఁ;
దెలియ వాతనికి నేపలుకు లింతైన,
'లాటిను', తేట తెల్లను 'ఫ్రెంచి', తగిన

పాటి 'యిటాలియా' భాషలలోన
నెఱుఁగఁ డేదియు వాతఁ డించుక యైన,
మఱియు 'యింగ్లీషు'లో మహా గవ్వయైనఁ
జేయ నే నని నిల్చి స్థిరముగా నీవె
న్యాయసభలఁ బ్రమాణము చేయఁగలవు.
అతఁ డెంతయును సుందరాంగుఁడె కాని,
సతతంబు నెఱమూగసంజ్ఞలతో నె
వ్వెవ్వరు మాటాడ నిల నోపఁ గలరు?
నవ్వులాటగఁ దోఁచు ననుఁ గోరు టతఁడు.
'ఇటలి'లోఁ జొక్కాయి, యట 'ఫ్రాన్సు' నందు
బలువయినయిజారు, పరఁగుకుళ్ళాయి
'జర్మని'లోఁ గొని, సకల దేశములఁ
గూర్మినడత నేర్చుకొనియెఁ గాఁబోలు!

నెరి—అతనిసమీపస్థుఁడయిన 'స్కాట్లాండు'
పతినిగూరిచి యేమి పలికెదు నీవు?

పోర్షియా—పొరుగువాని కితండు పరమోపకారి;
వరియించువిషయమా వాగ్వాదమందు
గట్టిగా నొకలెంపకాయను బొంది.
పట్టుతో 'యింగ్లీషు' వానికి దానిఁ
దనచేత శక్తిగల్గినయప్డుతీర్తు
ననుచుఁ బ్రమాణంబు నొనరించె నితఁడు
అడ్డువచ్చిన 'ఫ్రెంచి' యత డాబుణంబు
వడ్డితో విడఁ బూఁటపడెనని యెంతు.

నెరి—పడఁతిరో! 'శాక్సనీ' ప్రభు నన్నకొడుకు

పడుచు 'జర్మను' నెట్లు భావింతు వీవు?

పోర్షి—తెలివిగలిగియుండు దినపూర్వభాగ
ములనె యాతని నీచముగఁ జూచుచుండు;
స్మరణ తప్పఁగ ద్రాగు మధ్యాహ్నవేళ
గరము నీచతమముగాఁ జూచుచుండు
ఘనవివేకముచాలఁ గలయప్పు డతఁడు
మనుజునికంటెను మఱితక్కువగును;
మిగులంగ నవివేకి యగునప్పు డతఁడు
మృగముకంటె నొకింత మెఱుఁగా నుండు
ప్రాణగండమువచ్చు పట్టుననైనఁ
ద్రాణమై నేదేని తంత్రంబు పన్ని
పతినిగా నీతని వరియింప కుండఁ
గొతుకక తప్పించుకొనుదాన నేను.

నెరి—వరియింపఁగాఁ బూనివచ్చియీతండు
సరియైనపెట్టెనె సాధించునపుడు,
నీవు వరింపక నెపపెట్టి యితని
బోవబంచితివేని, పొలతిరో! నీదు
జనకుండు మరణశాసనమందు వ్రాసి
చనిన యాజ్ఞను మీఱి చరియింపవలయు

పోర్షి—అటువంటి విపరీత మిటఁ బుట్టకుండఁ
దటుకున సారాయి తగినంతయున్న
యట్టి యద్దపుగిన్నియను దెచ్చికృపను
బెట్టియుంచుము తప్పు పెట్టియమీఁద
లోన రాకసి నొక్కధానిన బెట్టి

పైనిట్టిమచ్చును బచరింతు వేని,
చేరి యాపెట్టెనె చెచ్చెర నితఁడు
కోరునం చెఱుఁగుదుఁ గుతుకంబుతోడ.
విను మిట్టి పావనమూర్తిని జేసికొనక
మునుపు నేనేమి చేసినఁ జేయుదాన.

నెరి—ఈవు భయంపడ కీపరిభువులందు
నేవాఁడుగాని నీ కేలిక గాఁడు;
నోరెత్తి వారిమనోనిశ్చయముల
వారెఱింగించిరి వరుసగా నాకు;
పెట్టెలఁబట్టియే పితృనియోగమున
గట్టిగా వరియింతుఁ గాంతునినంట
మాని వేఱొకమంచిమార్గంబు నీవు
పూనిచూపినఁ దక్కఁ, బోదురు వారు
తమతమగృహముల దారిని బట్టి
శ్రమ పెట్టకిఁక దర్శనములతో నిన్ను
వరియించు తలఁపులు వడిఁగట్టిపెట్టి.

పోర్షియ—విను 'సిబిల్లా' యంత వృద్ధకామినిగ
మనుదునేని, 'డియాన' మాడ్కిని నేను
బరిశుద్ధకన్యకాత్వమునందె యుండి
మరణంబు నొందుదు; మఱి యంతెకాని
ఘననియోగము మీఱఁ గలదానఁగాను
ఈకాముకులమంద' యిటు వివేకంబు
చేకొనుటకు సంతసించెద నేను.

అందఱు వీరిలో, సరిగినందువలను
డెందంబులో మోద మొందంగవలయు
వారె కాని, యొకండు వీరిలోపలను
వేరుచందమువాఁడు వెదకిన లేఁడు:
కావున క్షేమంబుతో వార లెల్లఁ
బోవఁగ నిండ్లకు దైవంబుఁ గొలుతు.

నెరి— వెనుక నీతండ్రి జీవించియున్నపుడు
ఘనపండితుఁడు శూరజనమండనుండు
వచ్చె నొక 'వినీసు' పట్టణవాసి
యిచ్చటి కొకసారి, యింపు దీపింప
నా 'మాంటుఫెఱ్ఱటు' భూమీశుతోడ,
ఏమైన జ్ఞప్తి నీ కింతయు లేదె?

పోర్షి— ఔనౌను. మఱవ 'బస్సానియో' యతఁడు
నేనెంతు నదె యాతనిసమాఖ్య యంచు.

నెరి— ఔను. సత్యముసుమ్మి; యోనాతిమిన్న!
నేనుజూచిన యెల్ల మానవులందు
నతఁ డొక్కఁడే కడు నర్హతముండు
నుతిపాత్రి యా మేలిసతిని వరింప.

పోర్షి— జ్ఞప్తిలోనున్నాఁడు చక్కఁగా నతఁడు;
జ్ఞప్తిఁ బట్టి, తలంప సరిగనాతండు
కరము నర్హుఁడు నీవు కామించుస్తుతికి.
[సేవకుఁడు ప్రవేశించు చున్నాఁడు.]
సరిగఁ జెప్పుము సమాచారము లేమి!

సేవ— నలువురుఁ, గ్రొత్తవా రెలమి నీయొద్ద

సెలవుఁ గైకొనియేగఁ దలఁచియున్నాడు;
ఏనవవాఁడయి యెసఁగు మొరాకో,
భూనాథుకడనుండి ముందుగా దూత
వచ్చి, యిటకుఁ దనప్రభువె యీరాత్రి
వచ్చునంచును దెచ్చె వర్తమానంబు

పోర్షి—తక్కినవారిని దయచేసిపంపఁ
జక్కఁగా మన్నించుచుందంబుగానె,
నైదవవానిని నంత నెమ్మదిని
యాదరింప వలంతి నయ్యెడ నేని,
ఆనంద మొందుదు నతనరాకకును
మానినిరో! 'మొరాకో' యను జేశ్వరుండు
కడు సాధుహృదయంబు గలుగు వాఁ డయ్యె
వెడఁగురక్కసిఁబోలు నొడలి వాఁడైన,
విను మాతనిని గౌరవింతునె కాని
మనసార నొడఁబడ మఱి పెండ్లియాడ
పొలఁతుకరో! రమ్ము పోదము మనము.

(సేవకునితో)

నిలువక యోరోరి! నీవుపొమ్మువుల;
వెలికొక్క కాముకు వెడలంగఁ బంచి
తలుపు వేసికొనుచు తడవుగానుండు;
క్రమ్మఱ నింతలోఁ గాముకుం డొకడు
గుమ్మముకడఁజేరి గుద్దును దలుపు

(అందఱు నిష్క్రమించిరి.)

. 3. రంగము—వినీసు నగరములో నొకబహిరంగస్థలము

[బస్సానియో, షైలాకు ప్రవేశించుచున్నారు]

షైలా—మాడలుమూడు వేలు—మంచిది; యింక?
బస్సా—మాడ లన్నియె; మీఁతి మూడుమాసములు.
షైలా—మాసములును మూడు—మంచిది, యింక?
బస్సా—ఆసొమ్మునకు నెల్ల 'నాంటోనియోయె,
        చిత్తగింపుము నేను జెప్పినయట్ల.
        యుత్తరవాదిగా నుండును జుమ్ము.
షైలా—'ఆంటోనియో, బద్ధుఁ డగు—మంచిదయ్య.
బస్సా—వెంటనే కోరినవిత్తంబునిచ్చి
        డెందంబు నానంద మొందింపఁగలవె?
        ఇందున కుత్తర మేమి యిచ్చెదవు?
షైలా—మాడలు మూడువేల్—మఱి వాని గడువు
        మూడుమాసంబులు—మొత్తముదీర్ప
        నొడఁబడి యాంటోనియో, బద్ధుడగును.
బస్సా—అడిగినదానికి నిడుముత్తరంబు.
షైలా—'ఆంటోనియో' మంచి యతఁడగు నయ్య.
బస్సా—వింటివెయెందైన వేఱుగానీవు?
షైలా—లేదు లేదింతయు లేదు లేదయ్య;
        ఆడట నే మంచియతఁ డంచు నతనిఁ
        బలుకుట కుత్తరవాదిగా నుండ
        వలఁతి యంచు మదభిప్రాయంబునుమ్ము
        అయిన నాతనిభాగ్య మంతయు నిపుడు

భయదచంచలదశఁ బడసియుండెడిని
ఆయన కున్నట్టియా యోడలందుఁ
బోయెఁ దానొకటి 'ట్రిపోలీ'కి, మఱియు
'హిందు' దేశంబున కేగె నొండొకటి;
విందు నంతియ కాక విపణి కే నేగి,
యొకయోడ 'మెక్సికో' కొండొకయోడ
యకట 'యింగ్లాండు'న కరిగెనటంచు;
ఇది గాక తకిచనయెల్లయోడలును
చెదరి యున్నవి పెక్కుసీమలయందు,
బల్ల చెక్కలె యోడ, లల్లనావికులు
నెల్లరు మర్త్యులే; యింతయు గాక
స్థలమూషకంబులు జలమూషికములు
పలునీటిదొంగలు స్థలతస్కరులును—
కా దోడదొంగలు—కరమునుగలరు!
మేదినీధరములు, మితిమీఱుగాలి,
ప్రవహించుపెనునీరు బహు హానిఁ జేయు
అవి యెల్ల నెట్లున్న, నాతండు కరము
చాలి యుండినవాఁడె—చక్కనిమూడు
వేల మాడలు—నేను విశ్వాసము నుంచి
యీయెడఁ బత్రంబు వ్రాయించుకొనుచు
నీయ వచ్చుననియె యెంతు నాతనికి.

బస్సా—నిస్సంశయంబుగ నీ వీయవచ్చు

షైలా—నిస్సంశయంబుగ నే నీయవచ్చు
నంచి దాలోచింతు, మన్ననో, రూఢి

యించుక కుదురంగ, నీవిషయంబె
నేను నమ్మదిగ 'నాంటోనియో' తోడఁ
బూనిమాటాడంగఁ బొసఁగు నేనేఁడు!

బస్సా—మాతోడభుజియింపనేతెంతు వేని,
యాతనితోడ మాటాడంగ వచ్చు.

షైలా—వాసన గననేమొ పందిమాంసంబు
మీసరంబుగ మున్ను మీయుతకర్త
పెనుదయ్యమును లోనఁ బెట్టిన పంది
ఘనశరీరంబును దినుటకై యేమొ.
కలియుదు మీతోడఁ గ్రమవిక్రయములఁ,
బలుకు లాడంగను, బయనంబు సేయ,
నీరీతిపనుల మఱెన్నిట నైన;
అరయ మీతోడ నంతియ కాని,
నేను భుజింపను, బానంబు సేయ,
ధ్యానంబు కలిసి చేయను భగవంతు—(సేవకునితో)
విపణిలో నేమైన వింతలు గలవె?
ఇపు డిందు వచ్చెద రెవ్వరు వారు!

[అంటోనియో ప్రవేశించు చున్నాఁడు.]

బస్సా—'అంటోనియో' సుమీ యీవచ్చు వాఁడు.

షైలా—(తనలో) కంటకు నితఁ డిచ్చకంబులు పలుకు
సుంకరిగతి నెట్లు చూడ నయ్యెడునో!
ఇంక ద్వేషించెద నీతని నొక్క
క్రైస్తవుఁ డనునట్టికారణమునె;
విస్తారముగ సొమ్ము వృద్ధిఁ గైకొనక

పరులకు నప్పిచ్చి, వడ్డిక్రమంబు
నరయక చెడఁగొట్టి యవివేకిరీతి
మఱియా 'వినీసు'లో మాబోంట్ల కెల్లఁ
దఱుగని నష్టంబు తగిలించుఁ గాన
రోఁత పుట్టు మఱింత యాతనిమీఁద.
ఈతనిజుట్టొక్కయింత నాచేత
దొరకినఁ జాలును, దొంటివైరంబు
కరమర్థి సాధింపఁ గలవాఁడ నేను.
మహనీయు లయినట్టిమాజాతివారి
బహుతరద్వేషభావంబునఁ జూచు;
వణిజు లందఱుఁ గూడుపట్టునఁగూడ
గణన సేయక నన్నుఁ, గడు నేనొనర్చు
బేరంబును, నధర్మవృద్ధియం చొక్క
పేరిడి వ్యవహారవిధమున వచ్చు
న్యాయార్జితం బైననాదులాభమును,
దోయమువారిలో దూషించు చుండు.
చేతిలోపల వచ్చి చిక్కినయపుడె
యాతనిఁ గరుణించి యే నైఁతు నేని
మాకులంబున కవమానకరంపు
వ్యాకులతను గూర్చువాఁడ నేనౌదు.

బస్సా—వినుచున్నావె నేనను చున్నదాని ?

షైలా—ధనమిప్పుడెంత నాదగ్గఱనిఝ్య
నౌదవునో చింతించుచున్నాఁడ మదిని;
పదిలంబుగా జ్ఞప్తిఁ బట్టియూహింప

మూడువేల్డాకల మొత్తంబు నేను
నేఁడు పూర్ణంబుగా నిమిషంబులోన
నర్పింపఁగాఁ జాల; నయిన నేమాయె!
ఓర్పుతో నడుగ, మా 'యూదుల' జాతి
వాఁడైన 'ట్యూబలు' బహుధనికుండు
నేఁడు తప్పక యిచ్చు నేఁగోరుసొమ్ము
తాళు మించుక సేఁపు; తగ నెన్ని నెలల
కాలంబు వలయును గడు వింక మీకు?
ఘనశుభంబులు నీకుఁ గలుగును గాక!

(ఆంటోనియోతో)

నినుగూర్చియే యింతదనుక నిందు
మాటాడుచున్నాము మాలోన మేము

ఆంటో—నూటి కింత యనుచు నొక్కి యొక్కింత
వడ్డిని గైకొని బదు లిచ్చి యుండె,
వడ్డినూరక యిచ్చి పరులదగ్గఱను
బదులుచేకొనియుండె, పరికించిచూడ
నిదివఱ కెన్నండు నెఱుఁగను నేను;
ఐన, మిత్రునిగొప్పయక్కఱఁదీర్పఁ
బూనినావ్రతభంగమున కొప్పుకొందు

(బస్సానియోతో)

ఈ వెఱింగించితే యితనితో నెంత
కావలయునో సొమ్ము గట్టిగా నీకు?

షైలా—మూడ లీతఁడు నన్ను మూడు వే లడిగె

ఆంటో—మూడుమాసంబు లప్పను దీర్చగడువు

షైలా—మఱచిపోయితి; మూడుమాసములౌను;
మఱి చెప్పితిరి మీరు మంచిదట్లయిన
వంచింప కిపుడిందు పత్రంబువ్రాసి—
కొంచె మాలోచించుకోననిందు నన్ను.
వినవయ్య; యిప్పుడు వృద్ధికి నీవు
ధన మప్పు గొనననని, దాని నన్యులకు
బదు లియ్య ననియును బలికినయట్లు
విదితముగా నింత వినిపించెఁ జెవికి.
ఆంటో—పనియట్టి దెన్నఁడు నొనరింప నేను

షైలా—వెనుకను 'జ్యాకబు' దన పినతండ్రి
యైన 'లేబను' గొఱ్ఱియల మేపునపుడు,
(జ్ఞానాఢ్యురాలైన జనని తా నతని
పక్షంబునను మంచిపని చేయు కతన)
దక్షతఁ బావనతముఁడైన 'యాబ్ర
హాము' నుండియు నరయఁ దృతీయుఁడైన
స్వామి యయ్యెను గాదె వానికి నెల్ల!
అవునవు మూడవయనుభోక్త యయ్యె.
ఆంటో—అవు నాతనిగుఱించి యనియెడి దేమి?
అతఁ డేమయిన వడ్డినటఁ బుచ్చుకొనెనె?

షైలా—అతఁడు వడ్డి గ్రహింపఁ డరసి చూడంగ;
మీయర్థమునుబట్టి మేదిని సరిగ
నాయది వడ్డికా దణుమాత్రమైన.
కను మేమి 'జ్యాకబు' కావించినాఁడొ
మును 'లేబను'ను దాను ముదముతోఁ గలిసి

చిత్రవర్ణంబును జెలఁగు చాఱలును
గాత్రంబునందును గలగొఱ్ఱెపిల్ల
లెల్లను గూలికై యియ్యంగఁ దనకుఁ
జెల్లెడియేర్పాటు చేసికొన్నపుడు,
నేరుపరి యగు నా నెఱగొల్లవాఁడు
చేరి కఱ్ఱలు కొన్ని చిత్రవర్ణంబు
సంభవం బగునట్లు చర్మంబునొలిచి,
సంభోగ వేళ మేషంబులు వానిఁ
జూచునట్టుగ నొక్క చోటను బాఁతె;
చూచి యవ్వాని సురతంపు వేళ
మచ్చపిల్లలఁ బెట్టె మఱి గొఱ్ఱెలెల్ల,
అచ్చట నవి యెల్ల 'జ్యాకబు' వయ్యె,
ఇది యొక మార్గ మీయిల వృద్ధినొంద;
పొదలెను దీవనఁ బొంది యాతండు.
ముచ్చిలి గడియింపఁ బూనక యున్న
మెచ్చగుఁ జుమ్మి భూమిని వృద్ధి గనుట.

ఆంటో—అది యదృష్టము చూత మని 'జ్యాక' బెంచి
పదఁపడి చేసినపని యంతె కాని,
దాని ఘటించు టాతవిశక్తిలోని
దేనాఁడుఁ గానేర దించుక యైన;
దైవంబు దయచేసి తాను నారీతిఁ
గావించెఁ గావునఁ గలిగె వాంఛితము.
అది వడ్డి మంచిది యని చూపుకొఱకు
మొదలను మనవేదమునఁ జేర్పఁబడెనె?

కాక, నీవైన బంగారంబు వెండి
మేకోనఁ బొట్టేళ్ళ మేషాంగనలునె!

షైలా—అది చెప్పఁజాలనే నంతియె కాని,
వెదపెట్టి యంతటివేగంబుతోనె
విత్తంబుఁ బిల్లలఁ బెట్టింపఁగలను.
చిత్తగింపుఁడు నేను చెప్పెడుమాట—

ఆంటో—(తమలో) వినుమి యీయసురుండు వేదంబునుండి
తనపనికిఁ బ్రమాణమును జూపఁగలఁడు.
తనదురాచరణంబు స్థాపించుకొఅకుఁ
బనిఁ గొనుచుఁ బ్రమాణ వచనముల్ నుడువు
కష్టాత్ముఁడు, నగుమొగంబును బూను
దుష్టునికరణిని, దొట్లఁ జూవులకు
బాగుగా నుండి లోపలఁ గుళ్ళినట్టి
రేఁగుఫలముయొక్క రీతిని నుండు.
ఔరౌర! పయి కెంత యందంబుగాను
ధారుణిఁ గాన్పించు దబ్బఱ యెవుడు!

షైలా—మూడలు మూడు వేల్—మంచి మొత్తంబు;
మూడు మాసము లొక్క యేఁడాదిలోన—
ఈనెలలకు వడ్డి యెంత కాఁగలదో
యేను జూచుకొనుచు నెన్నిక వేసి.

ఆంటో—సొమ్మును దయచేసి మమ్ముఁ బంపెదవె!

షైలా—నమ్మిక చెడ నాధనమ్మునుగూర్చి
వడ్డిని గూర్చియుఁ బలుమాఱు నన్ను
సడ్డ సేయక తిట్టి సరివారిలోన

నవమాన పఱిచితి వంగళ్ళవాడ.
అవియెల్ల సహియించి యడఁగి యున్నాఁడ,
శాంతియే యెందు మాజాతివారికిని.
గాంతి నిచ్చెడియలంకారంబుగాన.
నాయిష్ట మగురీతి నాసొంతసొమ్ము
హాయిగా వాడిక చేయుతప్పునకే,
యంతగా 'నాస్తికుఁడా' యంచు మఱియు
'గొంతుకలను గోయు కుక్కా' యటంచుఁ
బిలిచివైచితి వుమ్మి వలువలమీఁద.
బళి! నీకు నిపుడు నావలనితోడ్పాటు
కావలసినయట్లు కానిపించెడును.
నీవద్ద వేయేల? నీవు నాకడకుఁ
జనుదెంచి యిటమాకు ధనము కావలయు
ననుచును మఱిమఱి యడుగు చున్నావు.
వెనుక గడ్డముమీఁద వెస నుమ్మివైచి
చని లోన దూఱినశునకంబు నొకటఁ
దన్నినగతి నన్నుఁ దన్నిననీవె
వెన్నాడి ఋణమియ్య వేడుచున్నావు.
ఈయెడ నీకు నేనేమి యుత్తరము
నీయంగవలయును? ఓయి! యెందైన
శునకంబునొద్దను సొమ్ముండునయ్య?
పనికిమాలినకుక్క బదులుగా మూడు
వేలమాడల నియ్యఁజాలునె? యంచు
లీల నేఁబలుకంగఁ బోలదే యిపుడు?

ఏను నీకడవంగి భృత్యరావమున
దానిక యూపిరినైన బిగ్గరగ!
వినయంబుతోఁప మెల్లనివాక్యములను
'ఘనపుణ్య! బుధవారమున మొన్న మీర
లొకతేప నామీఁద నుమ్మివైచితిరి;
ఒకనాఁడు తన్నితి రూరక నన్ను;
మఱియొక్కదినమున మన్నించి నన్నుఁ
బిఱికికుక్క యటంచుఁ బిలిచినవారు;
మీరుచేసిన యిట్టి గౌరవాధిక్య
కారణంబున నియ్యఁగలవాఁడ ఋణము
నని చెప్పుదునె నేను హర్షంబుతోడ?

ఆంటో—నిను నిప్పుడునుగూడ నే నట్లె పిలిచి,
తిన్నఁగాఁ బయినుమ్మి తిరుగంగ వైచి,
తన్నునుగూడను దన్నంగవలయు.
ఇయ్యెడ నాకప్పు నిచ్చెదవేని,
నెయ్యున కిచ్చున ట్లియ్యంగఁ బోకు;
ఏలయన్నను, నెప్పు డెవ్వఁడు సఖుని
పాలను సొమ్మిచ్చి వడ్డిగైకొనెను?
అదికాన, నీవిప్పు డరికిచ్చినట్లె
బదులిమ్ము నాకును; పలికినయట్టి
మాటతప్పితివేని, మఱియు నిర్దయత
పాటించి కైకొనవచ్చు దండుగను,

పైలా—ఇంతలోవచ్చె నీకెంతకోపంబో!
ఎంతయు నీతోడ నిపుడు స్నేహంబు

కావించుకొని, నీదు కరుణయుఁ బడసి,
నీవొనర్చినయట్టి నికృతుల మఱచి,
యివ్వేళ నీయక్కఱెల్లనుదీర్చి,
గవ్వయు వడ్డిని గైకొనకుండ
ధనము నీకప్పియ్యఁ దలచినవాఁడ ;
వినుము నామాటలు కొనముట్ట నీవు ;
దయఁబూనియే యియ్యఁదలఁపుగొన్నాఁడ.

బస్సా—దయచేత ఋణమగు ధనమిత్తు వేని.

షైలా—ఈయుపకారంబు నేఁ జేయువాఁడ
న్యాయవాదికడకు నావెంటవచ్చి
'గడవునాఁటికి సొమ్ము కడతేఱనీని
యెడలను, నేను నాయొడలియందుండి
సేరుమాంసంబును శీఘ్రంబ నీవు
కోరినచోటును గోసి యియ్యంగఁ
గలవాఁడ' నని యొక్కగడువుపత్రంబు
బలువినోదార్థంబు వ్రాసి చేవ్రాలు
చేసి యాతండు వీక్షింపుచునుండ
వేసి నీముద్రను వేగ నాకిమ్ము.

ఆంటో—ఇంతటితోడనీవిఁకఁదృప్తినొందు
సంతక మొనరించి సరిగఁబత్రమును,
కలదు 'యూదు'నికిని కనికరమంచుఁ
బలుకంగఁగలవాఁడ బహుముఖంబులను.

బస్సా—న్యాయంబు కానీవు నానిమిత్తంబు
వ్రాయకు మటువంటిపత్రంబు నెపుడు;

ఇట్టిపత్రమున కీవీకొంటకంటె
నట్టెయుండెద నున్నయట్టియాస్థితినె.

ఆంటో—మిత్రుఁడ! భయ మెంతమాత్రంబు పడకు;
పత్రింబులోపల వ్రాసినయట్టి
గడువు దాఁటఁగ నియ్యఁగలవాఁడఁగాను.
జడియకు రెండుమాసంబులలోన
(మనపెట్టుమితి కొక్కమాసంబుముందె)
చనుదెంచు నోడ లిచ్చుటకిని నావి
మనమితనికి నియ్యఁ జను సొమ్ముకంటె
వినుము తొమ్మిదిరెట్లు విత్తంబుతోడ.

షైలా—ఏమి! యీ క్రైస్తవు లెంతటివారు!
తా మితరులతోడఁ దగఁ జేయునట్టి
వ్యవహారముల నెంచి, పరులపైఁగూడ
మిపుల సంశయమున మెలఁగు చుండుదురు.
దయచేసి దీనికుత్తర మిమ్ము నాకు!
పయిసన్నమితికిలోపల సొమ్మితండు
చెల్లింప లేకున్న, సేరుమాంసంబు
నల్లపత్రముఁబట్టి యదిమి కైకొన్న,
లాభంబు నాకేమి లభియింపఁగలదు?
ఈభువి నరమాంస మెంచిచూడంగ
గొఱియల మేఁకల గొడ్లలో వేని
మెఱచికి వెలయుండు నెనరాకయుండు;
ధర నంత యుపయోగకరమును గాదు.
కరము నీతని మైత్రి గడియింకొనఁగ

నుపకార మిదిచేయ నొప్పుకొన్నాఁడ
ఇపుడిష్టముండి తా నీతండు దాని
నంగీకరించిన నదియొక మేలు;
అంగీకరింపఁడే నటమున్న మేలు
నాయనుగ్రహ మెంచి, నాకేమి కీడు
చేయకుండఁగమీకుఁ జేయుదున తిని

ఆంటో—నీకొడంబడికను నేవ్రాసియిత్తు.

షైలా—ఈకొంచు వేని నీవిటు వ్రాసియియ్య,
న్యాయవాదికడ నడిచి పత్రమున
వ్రాయుపద్ధతి నీవు వాక్రుచ్చుచుండు;
చని నేను మాడలు సంచిలో వేసి,
ధనమును దుర్వ్యయ మొనరింపఁజూచు
పలుగుభృత్యునియొక్క వశమున నున్న
యిను చూచు కొనివత్తు నీనిమిషంబ.

ఆంటో—త్వరితముగా రమ్ము తగువాఁడవీవు

[షై॥ వెళ్లెను.]

కరుణాళుఁడయ్యెడుఁ గరమునునితఁడు;
ఈ 'యూదు' డగుఁజుమీ యిఁకఁ గ్రైస్తవుఁడుగ.

బస్సా—తీయనిపలుకులుఁ దెక్కలిమనసుఁ
గలవారి నెంతయు గర్హింతు నేను

ఆంటో—అళుకొంద వలపిన యక్కఱ లేదు;
నడతెమ్ము పోదము; నాయోడలెల్ల
గడు వొక్క నెలయుండఁగనె యిల్లుచేరు

(అందఱు నిష్క్రమించిరి.)

ద్వితీయాంకము

౧. రంగము—బెల్మంటుపురము. పోర్ష్యగృహములోని గది.

[వాద్యములు మ్రోయఁగా తనపరివారముతో మొరాకో
రాజకుమారుఁడును, పరిచారకులతోఁగూడ పోర్షయును,
నెరిస్సాయును, ప్రవేశించుచున్నారు.]

మొరా—కరముదగ్గఱనుండి పెరిగినకతన
ఖరకిరణుఁడు నాకుఁ గరుణించినట్టి
నీలాంబరంబన నెగడు నామేని
నీలిడాలునుజూచి నెలఁతరో! నన్ను
సేవగింపఁగబోకు మించుకయేని
కేవలమును సూర్యకిరణాగ్ని సోఁకి
మంచుగడ్డలను గరంచఁగాలేని
మంచియుత్తరభూమి మఱిపుట్టినట్టి
కడునందగాని నాకడకును దెచ్చి
వడిగ నీప్రేమంబు బయలఁబడంగ
గంటులొనర్ప మాకాయంబులందు
బంటుతనముఁ దెల్పుబహుశోణరక్త
మెవ్వనిలోపల నెసఁగియుండెడునో
యివ్వడి వందఱె కెఱుఁగంగ నగును
ఎఱిఁగింతు వినుము నాయీరూపమున్న
వెఱవు పుట్టించెను వీరులమదికి;
వానిమెద గొప్పబాసను జేసి
నాకూర్మిసాక్షిగ, నళినాయతాక్షి!

మానీమఁ గలయట్టిమగువలం దెల్ల
వాసికెక్కినరూపవతు లెల్లవారు
నీరూపమునకె మోహింతురు నన్ను
ఈరంగు మార్చుకో నేనిచ్చగింప
నీరజాక్షీమణి! నీమానసమును
గోరి హరించెడికోఱికఁ గాదేని.

పోర్షి—కన్నెనయ్యు వరించుకార్యమందొక్క
కన్నులచేతనే ఘనవివేకంబు
వదలి, నే నడపంగఁబడుదానఁ గాను;
అదిగాక నియతియొం డడ్డముండుటను
వఱుని స్వేచ్ఛగఁ గోర వల్లగాకుండు
అరయ నింతకుముందె యువులమీతోఁడ
విన్నవించినయట్టివిధముగా నెవఁడు
నన్ను సాధించునో యన్నరాగ్రణికి
నేనుభార్యనుగాఁగ నిర్బంధమొకటి
పూని నాజనకుండు బుద్ధిపెంపునను
గావింపఁడేనియు, ఘనకీర్తిధామ!
నీవును ననుగోరి నేఁటివఱకును
వచ్చియుండినయెల్లవారలవలెనె
హెచ్చుచక్కనివాఁడవే యయి యుందు
వెందు నాదృష్టికి, నిది నిశ్చయంబు.

మొరా—అందునకును మ్రొక్కు లర్పింతునీకు;
కరుణించి పెట్టెలకడకును నన్ను
నరగునఁ గొనిపొమ్ము; చనినాయదృష్ట

మెటులుండునో యత్నమేఁజేసిచూతు.
ఇటమున్న మువ్యాఘ్రము లెదిరించి పోరి
'సాలిమా' ననఁగను జనెడి 'సుర్తాను'
నాలంబులో గెల్చినట్టియా 'పార
సీక' రాజును, బుత్రుఁ, జెండాడినట్టి
యాఁక త్రిత్రోడు, నేనిటువంటిక్రూర
దృష్టివానిని మించు తేఱిచూచెదను;
సృష్టిలోపలనెట్టి స్థిరధైర్యశాలి
యైనవానిని మింతు నతిధైర్యగరిమ;
ఈనినప్పుడు తల్లియెలుఁగఁబాల్ద్రావు
నెలుఁగుపిల్లలనెల్ల నీడిచి తెత్తు;
బలమైనయాఁకటఁ బటుగర్జనంబు
నొనరించుసింహంబు నొగివెక్కిరింతు;
వనితరో! నిను గెల్చుకొనియెడుకొఱకు.
కటకటా ! చింతింతుఁ గాలవక్రతకు.
పటుసమర్థుఁడెవఁడో పరికించుకొఱకు,
యజమానుఁడైనట్టియల్ల 'హార్క్యులెసు'
నిజసేవకుండయి నెగడు లిచాసుఁ
గలిసి జూదము నాడఁగను దైవికముగ
బలహీనునికె పెద్దపందెంబు భువిని
బడవచ్చుఁ బాచికల్ పట్టివేయంగ.
ఒడిచె 'హార్క్యులెసు' నె యొకసారితొల్లి
సరిగ సేవకుఁ డట్టిచందంబుగానె.
అరయ నేనును నట్లె యంధమైనట్టి

భాగ్యంబుచే నడపంగను బడుచు
యోగ్యపేటికి నయోగ్యున కట్టె విడిచి
వెసఁ బోయి యొకతప్పుపెట్టెను గోరి
వ్యసనాతిశయుతఁ జావంగనువచ్చు.

పోర్షి—భారమదృష్టంబుపయి వైచినీవు
కోరఁ బ్రియత్నింప గూడదు మొదల;
అటుగాక కోర నేయత్నింతు వేని,
యటకేగి పెట్టియ నంటకమున్న
తప్పుపెట్టెనుగోరి తాఁకినయెడల
నెప్పుడు నిఁకమీఁద చుయింతితోడ
మఱివివాహముఁగూర్చి మాటాడనంచు
నుఱిదిప్రమాణంబు నొనరింపవలయు
కావునఁబరికించి కార్యంబుగనుము.

మొరా—ఏవెలందినినింక నేఁగోరఁబోను;
వచ్చి పెట్టెలఁ గనఁబఱుపుము నాకు.

పోర్షి—క్రచ్చఱ దేవతాగారంబునకును
ముందుగాఁ బోవలె; భుజియించి వెనుక
నిందుఁ బెట్టెలఁజూచి యేర్చుకోవచ్చు.

మొరా—ఓయదృష్టమ! మానసౌఘంబునందుఁ
జేయుదువో ధన్య శేఖరుఁగాఁగ
ఒనరింతువో లేక జనులలోనెల్లఁ
గనరాని మందభాగ్యుని గాఁగ నన్ను!
(వాద్యములు మ్రోయ వెళ్ళుచున్నారు.)

౨. రంగము—వినీసు నగరములో నొకవీధి

[లాంసిలాటు ప్రవేశించుచున్నాఁడు.]

లాంసి—నాయంతరాత్మయు నాస్వామియైన
యీ 'యూదు' కడనుండి యెటకైనఁబాఱి
పోవనొప్పును 'గ్రైస్తవుఁడ' నాట నేను
ఈవలను పిశాచ మిప్పుడే చేతి
సరసనుఁజేరి యో సర్వోత్తముండ!
సరగున లేచి, నీచరణంబులకును
బని పెట్టి, దవ్వుగఁ బఱుగిడు మనును.
'పని చెడు; వలదది పాడిగాదయ్య;
భద్రము! కాలెత్తి పఱచుట యన్న
క్షుద్రపుఁబనిగాఁగఁ జూచుకొ'మ్మనుచుఁ
బలుకుచున్నది తేటపడ నంతరాత్మ.
తలఁపఁ దెంపరియైనదయ్యంబు 'మూట
గట్టుము; పయనంబు గముకి లేలెమ్మ;
దిట్టతనముపూను దృఢముగా మదిని;
పాఱిపొ'మ్మనినన్ను బనుచుచున్నయది.
మీఱి దెందంబున మెడ కౌఁగిలించి
తద్దయు బుద్ధిగా దా నంతరాత్మ
'పెద్దమనుష్యుఁడా! పెద్దమనుష్యు
తనయుండవై యుండి తప్పకునీతి'
ననుచును గడు నాకు న్యాయంబుచెప్పు;
తొలుతను నాతండ్రి దొంగిలుటందు
నలవాటుచేఁ గొంత యభిరుచిగలుగు

వాఁడౌట, నను 'నయవంతురాలైన
యాఁడుదానితనయుఁడ' న్న బాగుండు.
'అరుగంగవలదయ్య' యనునంతరాత్మ;
'అరుగుముశీఘ్రంబ' యనుఁబిశాచంబు;
'అరుగంగవలదయ్య' యనునంతరాత్మ.
సరసంబుగా నీవు సద్బోధ నాకు
నొనరించెదవు చాల నోయంతరాత్మ!
ఒనరించెదవు నీవు నోపిశాచంబ
మంచిబోధనె నాకు మాటిమాటికిని,
వంచనలేక నే వడి నంతరాత్మ
చెప్పినరీతినె చేయుదు నేని,
తప్పక యొకరీతిదయ్యంబువంటి
'యూదు' ని యొద్దనె యుండంగవలయు;
'యూదు' ని కడనుండి యుఱుకుదు వేని,
తలఁపఁ గేవలమును దయ్యమే యైన
యులపిశాచముమాట వలయుఁ జెల్లింప.
అ 'య్యూదుఁడు' వి నిశ్చయంబుగ నల్ల
దయ్యంబునపరావతారంబె సుమ్ము.
కఠినత్వము వహించి కడు నంతరాత్మ
శత్రుఁడైన 'యూదు' ని సరసను నిలువఁ
బనుచుచున్నది మనోవ్యథ హెచ్చ నన్ను,
మనసున కింపుగా మంచియోచనను
జెప్పెదును బిశాచ మిప్పుడు మిగుల,
తప్పక పరుగెత్తెదను, బిశాచంబ!

నీదగు నాజ్ఞలో నిలిపితి నాదు
పాదద్వయము, నింకఁ బాఱిపో వెదను.

[ఒకగంప పట్టుకొని వృద్ధుఁడైన 'గాబో' ప్రవేశించుచున్నాఁడు]

గాబో—ఓయయ్యగారు! వే 'యూదుని' యింటి
కేయది త్రోవయో యెఱిఁగింపరయ్య.

లాంసి—(తనలో) ఆహాహా! నాకన్నయ య్యయే యితఁడు.
ఊహింప నరగుడ్డి నొక్కింత మించి,
నను నానవా లిడఁగను లేనికతనఁ
గొనవచ్చు ముప్పావుగుడ్డిగా నితని.
ఇప్పుడు క్షణమాత్రమీతనితోడ
గొప్పవినోదంబు గొలుప భాషింతు.

గాబో—ఓయయ్య! దయచేసియూదునియింటి
కేయది త్రోవయో యెఱిగింపు మయ్య.

లాంసి—మొదటిమళుపులోను ముఖ్యంబుగాను
వదలక కుడిచేతివైపునఁ దిరుగు;
తరువాయిమళుపులోఁ దప్పకుండంగఁ
దిరుగు మెడమచేతిదిక్కునకీవు;
ఆవలిమళుపులో నల 'మేరి' యాన,
యేవంకకును మళ్ళ కేగుము నీవు
'యూదుని' యింటికే యోరగా నడిచి.

గాబో—ఈదారి తెలియుట, యీశ్వరుతోడు
కరముకష్టంబుగఁ గాన్పించు నాకు.
పరిచరుఁడయి 'యూదు' ప్రజను నున్న
యల 'లాంసిలా' టిప్పుడందె యున్నాఁడో

కొలువేది యట లేఁడొ తెలుపంగఁగలరే!

లాంసి—మాటాడుచున్నావె మఱిచిన్న 'లాంసి
లాటు' గారినిగూర్చి మేటివృద్ధుండ!.
(తనలో) చూడు మేనిప్పుడు సొగసుగా నితని
నేడిపించెద నొక్కనిమంబులోన.

(ప్రకాశముగా)

మాటాడుచున్నావె మఱి చిన్న 'లాంసి
లాటు' గారినిగూర్చి మేటివృద్ధుండ!

గాబో—గారు గీరును లేదు; కడుబీదవాని
కూరిమిపుత్రుండు; గొప్పగ నేనె
యది చెప్పుచున్నను వాతనితండ్రి
దైవంబుకృపచేతఁ దగుచందమునను
జీవించుటకుఁ జాలుస్థితిగలవాఁడు.

లాంసి—కానిమ్ము జనకునిగతి యెట్టిదైన;
పూని యిందు మనమిపుడు చిన్న 'లాంసి
లాటు' గారినిగూర్చి మాటలాడెదము.

గాబో—మేటిమిత్రుండు స్వామికి 'లాంసిలాటు'.

లాంసి—అవు నందుచేతనే, ప్రార్థింతునన్ను,
వివరంబుగా, నోయి వృద్ధుండ! 'లాంసి
లాటు' గారినిగూర్చి మాటాడెదయ్య!

గాబో—మాటాడుదును 'లాంసిలాటు' గుఱించి,
కరుణించి మీర లుత్తర మిత్తురేని.

లాంసి—సరి! 'లాంసిలాటు' గారర యుంగ నతఁడు
మాటాడఁబోకయ్య. మాతండ్రి! 'లాంసి

లాటు' గారినిగూర్చి లౌల్యంబుతోఁప,
ఏల యనెదవేని, యెఱిఁగింతువినుము—
బాలుఁడాయన విధి వ్రాఁతలఁబట్టి,
గ్రహచారములఁబట్టి, సహజలాత్రివిధ
బహుచిత్రభాగ్య దేవతలను బట్టి,
జ్యోతిషాద్యధమశాస్త్రంబులఁ బట్టి,
జాతకమునుబట్టి, చచ్చినవాఁడు;
విను దాని యర్థంబు విప్పి చెప్పెదను—
చని యాతఁ డదె స్వర్గమున నున్నవాఁడు.

గాబో—హా! దైవము! ముదిమి నాబాలకుండు
నాదగు పెనుప్రాపు; నాయూఁతకోల.
లాంసి—నేను స్తంభమువలె నిట్రాడివలెను
గనఁబడుచున్నానె కనుఁగొన నీకు?
నను నెఱుంగుదువయ్య, నాకన్నతండ్రి?
గాబో—దినమహిమంబు నేమని యందు నకట!
నిను నే నెఱుఁగనయ్య; నిజము, కుమార!
అగుఁగాక రక్షణ మతనియాత్మకునును!
తగ నెఱింగింపుము దయచేసి, వాఁడు
మరణంబు నొందెనో మనియున్నవాఁడో.

లాంసి—అరసి నన్నెఱిఁగితివయ్య, యోతండ్రి?
గాబో—అక్కటా! వినుము నే నరగుడ్డివాఁడ;
నిక్కముగా నయ్య నిన్ను నే నెఱుఁగ.
లాంసి—నీకు నేత్రములున్న, నిజముగా నెఱుఁగ
లేకయేపోవచ్చు లెమ్ము నన్నీవు

తనకన్నకొడుకును దాఁగనుంగొనెడు
జనకుండు ఘనబుద్ధిశాలి గావలయు
ఓ పెద్దవాఁడ! నీకోపిక పెట్టి
నీపుత్రువార్తలు నేను దెల్పెదను.
దీవింపు మోయయ్య! నీవు నన్నిపుడు.
భావింప సత్యంబు బయలను బడును;
తనయునిపుట్టుక దాఁగంగ వచ్చు.
మనలోన నరహత్య మఱిదాఁగ దెపుడు;
నిలుకడమీఁదను నిజమొందు దెలియు.
(వెనుకతిరిగి మోకరించుచున్నాఁడు.)

గాబో—నిలుమయ్య, వేఁడెదవిన్ను నే నిపుడు;
వివరమెఱుంగుదు వినునాపుత్రుఁ
డవునట్టి 'లాంసిలాటు'వు గావు.

లాంసి—నిను వేఁడుకొనియెద, మనమింకముందు
పనికిమాలినపిచ్చిపనులు మఱేమి.
యీవిషయంబునఁ గావింపవలదు;
దీవన లీవయ్య తిన్నఁగా నాకు.
ఇప్పుఁడు పూర్వంబు నిఁకముందుఁ గూడఁ
దప్పకుండఁగ నీదుతనుజుండ నైన
'లాంసిలాటు'నె నమ్మి లక్షింప నేను.
గాబో—హింసపెట్టకు నన్ను; నే నించుకేని
నమ్మఁజాలను నీవు నాపట్టివనుచు.
లాంసి—అమ్మాడ్కిఁ జెప్పఁగ, నందునుగూర్చి
యేమియూహించుట కెఱుఁగను నేను;

నామము 'లాంసిలా'టీమహి నాది;
'యూదుని' భృత్యుఁడ నాఁడును నేను.
నీదుభార్యయగుచు మేదినిలోనఁ
దనరెడు 'మార్గరీ' యనునామె కేను.
దనయుండనౌదును దథ్యంబుగాను.

గాబో—మహినామెనామంబు 'మార్గరీ, నిజము
అహా! 'లాంసిఁగాటు'వే యగుదేని నీవు,
నారక్తమును మాంసమౌర నీవగుదు.
సైరింప నాతఁ డీశ్వరుఁ గొల్చుఁగాత!
ఎంతగడ్డమునీకు నిపుడున్నదౌర !
పంతముగా నాదు పందెపుగుఱ్ఱ
మైన 'డాబిను' తోఁకయందు నున్నట్టి
దానికంటెను జాల దట్టంబుగాను
గలవు వెండ్రుకలు నీగడ్డంబునందె.

లాంసి—తలఁపనట్లగునేని, తప్పకుండంగ
వెనుకవైపునకు 'డాబిను' తోఁక పెరుఁగు
చునునున్న నట్లుగఁ గనుపట్ట వలయు
కడసారి నే దానిఁ గాంచినయపుడు
పడిక్రిందికిని నాదువదనంబుకంటె
విను దానితోఁకకె విస్తారముగను
గనఁబడినవి వెండ్రుకలు నిశ్చయముగ.
గాబో—ఓయి ! యెంతగ మఱిపోయినా వీవు ?
నీయజమానుఁడు నీవును నింత
యిష్టంబుగా మీర లిపుడున్నవారె !

తుష్టికై యతనికిఁ దొలుత నర్పింపఁ
గను గానుకొక్కటి గొనివచ్చినాఁడ
కనియిప్పు డెట్లొప్పు గొనెదవు నీవు?

లాంసి—సరి! సరి! నేఁగొల్వుచాలించుకొనుచు
బరుగిడ నిశ్చయపఱుచుకొన్నాఁడఁ
గావున, నొక్కఁడ గంతిడుదాఁక
నేవలనను నిల్చి యేనుండఁ జాల
తాను గేవల 'యూదుఁ' డౌను నాస్వామి
వానికా కానుక పట్టుటకూడ!
ఉరిత్రాడు వానికి నొకదాని నిమ్ము
మఱిగియాతని సేవ మలమల మాడి
తిండికి లేక నే నెండుచున్నాఁడ
నిండుగా వ్రేలితో నిమిరి నాప్రక్క
యెముకలనెల్ల నీవెన్నంగవచ్చు
ప్రమదమందితి నీవు వచ్చినందునకు
నీవు తెచ్చిన కానుక నీవయ్య నాదు
భావిసత్ప్రభువైన 'బస్సానియోకు
ఆతడు నాకు నత్యద్భుతమైన
నూతనవస్త్రముల్ నూటాఱులిచ్చు,
ఆతనికొలువు నా కబ్బకయున్న'
నీతటి భగవంతు డిచ్చిన నేల
యంతయుఁ బరుగెత్తి నాసింతు నేను.
ఎంతనియెంతు నదృష్టంబు నిపుడు,
అరుదెంచుచున్నవాఁ డాయన యిటకు.

అరయు మోజనకుండ! యతనికె సుమ్మ,
విను మిఁకముందు యూఁటునిగొల్తునేని,
యనయంబు నే 'యూదుఁడ'నె యాదుఁగాక!

[లియోనార్డో మొదలయిన సేవకులతో బస్సానియో ప్రవేశించుచున్నాఁడు.]

బస్సా—ఆవిధంబున నీవు గావింపవచ్చు;
త్వరింపుము వేగ నీ వేగి, మిగుల
నాలస్య మయిన నో నయిదుగంటలకుఁ
జాల లోపల వంట సంసిద్ధపడఁగ
ఎవరివి వారికి నీ లేఖ లంపు;
సవరింప నుడుపుల సరగునఁ బనుపు;
నుడుపుము 'గ్రేషియానో'తోడ నీవు
వడి నీ క్షణము నాదు బసకు రమ్మంచు
(ఒక సేవకుఁడు పోవుచున్నాఁడు)

లాంసి—ఓయి! నాయన! అదె యాయన కయ్య,
గాబో—ఈయెడ నీశ్వరుఁ డిడు మీకుఁ శుభము
బస్సా—నీకు మేలగుఁగాక! నేఁడు నావలనఁ
జేకూఱఁ దగుపని నీకిందుఁ గలదె?
గాబో—బీదవాఁ డో దేవ, వీఁడె నాకొడుకు—
లాంసి—బీదవాఁడనుగాను, వినుడయ్య మిగుల
విత్తాఢ్యుఁ డగు 'యూదు' భృత్యుఁడ నేను
ఇత్తఱి నాతండ్రి యెఱిఁగింపఁబోవు
'ననువున నెంతయు మనసులోఁ గోరు—
గాబో—మనసులోపలఁ గోరుకొనుచుండుఁ జాల,

ప్రజ లనుకొన్నట్లు భక్తితో గొలువ—

లాంసి—నిజ మొక్కమాటలో నే సమస్తంబుఁ
జెప్పెద, 'యూదు'ని సేవకుఁగాఁగ
నిప్పు డేమన్నాఁడ' నిచ్చింతుఁ జాల
మాతండ్రి యికఁమీఁద మనవి యొనర్ప—

గాబో—అతఁడుఁ బ్రభువును నన్యోన్యమిష్ట
పడకుండ నున్నారు, వలయు మన్నింప—

లాంసి—కడు మాట లేటికి ? నుడివెద నిజము ;
'యూదుండు' పెనుకీడు నొనరించి నన్ను
ఖేదపెట్టుటఁబట్టి కేడించి నేను,
అనుకొంచుఁ బెద్దవాఁ డౌదుచే నాదు
జనకుండు మీతోడఁ జక్కఁగాఁ జెప్ప—

గాబో—పావురంబులగంప పనిఁబూని యిదిగొ
దేవర వారికై తెచ్చినవాఁడ ;
వినుఁడు నేనొనరించు విజ్ఞాపనంబు—

లాంసి—చనునిందుఁ దెలుపంగ సంక్షేపముగను;
విన్నవింపగఁ బోవు విజ్ఞాపనంబు
నన్నుఁగూర్చియె నుండి—నయపరుడైన
యీవృద్ధువలన మీ రెఱుఁగంగఁగలరు;
నే విన్నవించిన, నిజము నాతండ్రి
నెఱవృద్ధుఁ డయ్యును నిఱుపేదవాఁడు.

బస్సా—మఱి యింక నిద్దఱనూఱుగా నొకరె
మీ వేఁడికోలును గావించుకొనుఁడు.
నావల్లమీ కేమి కావలె నిపుడు?

లాంసి—కోరెద మీయొద్దఁ గుమరంగఁగొలువు.
గాబో—సారాంశ మిదినుండి సర్వంబునకును,
బస్సా—ఏ. నిన్నుఁ జక్కఁగా నెఱిఁగియున్నాఁడ;
నే నొప్పుకొన్నాఁడ నీప్రార్థనమును.
ఈయనుగ్రహమును జేయంగ నీకు
నీయజమానుఁడు నేఁడు 'షైలాకు'
చెప్పెను నాతోడ—శ్రీమంతుఁడైన
గొప్ప 'యూదు'ని యొక్క కొలువుజ్జగించి
నడతెంచి నావంటి కడుపేదప్రభువు
కడఁ జేరు టొకయనుగ్రహమయ్యె నేని.

లాంసి—తగుఁ దొంటిసామెత తథ్యంబుగాను
జగతిలో మీకును 'షైలాకు' నకును—
కల దీశ్వరకటాక్షగరిమంబు మీకు;
కలదయ్య యతనికిఁ గాంచనగరిమ.

బస్సా—(లాంసి॥ తో) కడుచక్కఁగాఁ బ్రసంగము చేయుదీవు.
(గాబో॥ తో) నడువుము నీవు నీకొడుకుతోఁ గూడ.
(లాంసి॥ తో) నీతొంటిప్రభువద్ద నీయాజ్ఞఁబొంది
యే తెమ్ము వెనుక మాయింటికినీవు—
(సేవకులతో) వీనికిమీరిందు భృత్యులకిచ్చు
వానిలో మేలంచుబట్టలజతను.
లాంసి—జనకుఁడా! లోనికిఁ జనుదెమ్ము నీవు.
పనినిసంపాదింపఁగను లేను నేను!
నాకెందు నోటిలో నాలుక లేదు!
(చేయిచూచుకొనుచు)

నాకరంబునకంటె నాడెమౌ హస్త
మెవ్వనికైన నీ 'యిటలి' లో నున్న,
(నివ్వడిఁ జెడిపోనె యే నిశ్చయముగ);
ఘనభాగ్యశాలిని గాఁ గలవాఁడ
నని పుస్తకము ముట్టుకొని ప్రమాణంబు
నిటఁ జేయుగతి నున్న దీహస్తతలము.
అటుచూడు మదె చిన్నయాయుష్యరేఖ,
అదె కొంచెముగ భార్య లందున్నవారు;
పదునేవురిల్లాండ్రు బహ్వల్ప మకట!
వారిలో విధవలు పదునొక్కరున్న
వారు; తొమ్మండ్రును పట్టికన్నియలు;
ఒక్క మనుష్యున కొకయిందఱుంట
యెక్కునై నయదృష్ట మెప్పుడుఁ గాదు.
జలగండములుఁ మూడు సరిగానుగలవు;
కలదు ప్రాణము పోవుగండము హంస
తూలికాతల్పముతోడ నందొకటి;
క్రాలు నిచ్చటఁ జిఱుగండముల్ మూడు.
మహి భాగ్యదేవత మగువయేయైన,
బహుయోగ్యురాలౌను బరఁగ నాకిన్ని
ఘనమైన మేళ్ళను గలిగించుకతన.
కనుఱెప్ప వేసెడు కాలంబులోన
'యూదు' ని కడకేగి యుత్తరువొంది
సాదరముగ వత్తు; జనకుండ! రమ్ము.

(లాంసిలాంటును, గాబోయును వెళ్ళుచున్నారు)

బస్సా—ఓయి 'లియోనార్డో!' చేయుముదీని.
ఈయెడ వలసినయెల్లవస్తువులఁ
గొనియింట నొప్పగింతను బెట్టి సరిగఁ
జనుడెమ్ము క్రమ్మఱ సరగను నీవు;
ఈరాత్రి విందు చేయింతును నేను
గూరిమి చెలులకు; గొబ్బునఁబొమ్ము.
లియో—ఈవిషయంబున నెల్లయత్నములఁ
గావింతునాశక్తి గలయంతవట్టు.

[గ్రేషియానో ప్రవేశించుచున్నాఁడు]

గ్రేషి—ఎచ్చట నున్నవాఁ డిపుడు నీప్రభువు?
లియో—అచ్చోట దవ్వుల నరుగు చున్నాఁడు.
(లియోనార్డో వెళ్లుచున్నాఁడు)
గ్రేషి—ఓయి 'బస్సానియో' యోచెలి కాఁడ!
బస్సా—ఓయి! వచ్చితివయ్య? యో'గ్రేషియానో!'
గ్రేషి—చేయుదు నీకొక్క చిన్న విన్నపము.
బస్సా—చేయ కుండనె దానిఁ జెల్లించినాఁడ.
గ్రేషి—నీవునారాకకు నిజముగా నిప్పు
డావంతయును నడ్డమాడంగవలదు;
నీతోడ 'బెల్మంటు' నేను రావలయు.
బస్సా—నాతోడరావచ్చు; నాయడ్డులేదు
కాని, యెప్పుడుమోటుగా నుందువీవు;
కానిపింతు వడవిమానిసివలెను;
వెనుకముం దరయక, వినునెల్ల యెడల
మనసువచ్చినయట్లు మాటాడె దీవు.

దైవికంబుగనీకుఁ దగియున్నయట్టి
నీవైనగుణములు మావంటివారి
కన్నులకును దప్పఁగాఁ గానఁబడవు;
నిన్నెఱుంగనిపట్ల నిజముగా నవియె
యతి దూష్యములు గాఁగ నగపించుఁజుమ్మి
బతిమాలెదను గష్టపడి యెట్టులైన
నణఁగి యుండని త్వదీయస్వభావంబు
నణఁకువ యను శీతలాంబుబిందువుల
చేత శాంతినిబొందఁ జేయుమునీవు;
ఏతెంచి నాతోడ నిటుసేయకున్న,
నీవెఱ్ఱినడతచే నేఁబోవునట్టి
తావున నను దప్పుఁ దలఁపంగ వచ్చు
దాన నాశాభంగ మై నేను బూను
పూనికంతయుఁజెడి పోవంగవచ్చు.

గ్రేషి—ఓయి'బస్సానియో' యొక్కటివినుము.
వేయేల! నేను గంభీరంబుగాను
గనువారికిని బైకిఁ గన్పడకున్న,
ఘనగౌరవము తోఁపఁగాఁ బల్కకున్న,
పెక్కుప్రమాణముల్ విడువకయున్న,
చొక్కాయిజేబులో స్తోత్రపుస్తకము
లమరించి శాంతాత్మ నట్లుండకున్న,
తమిమీఱనీశ్వరు ధ్యానించు వేళఁ
గనులను టోపితోఁ గప్పి నిట్టూర్పు
లనుబుచ్చి 'ఓం తత్స' తనకుండనున్న,

తనదుముత్తప్పను దనియించుకొనకుఁ
బనివడి గంభీరభావంబుఁ బూన
సలవడ్డపురుషునివలె, నాగరికతఁ
దెలిపెడియాచారముల నెల్ల నేను
బన్నుగా నుపయోగపఱుపకయున్న,
న న్నింక నెప్పుడు నమ్మఁబోకయ్య.

బస్సా—కానిమ్ము నీచాలకముఁ జూడఁ గలము.

గ్రేషి—కాని, యీరాత్రి నేఁ గావింపనట్లు;
ఈ రేయి మనచేయు నెద్దానివలన
మీరు నాచేష్టల మెచ్చెన్నరాదు

బస్సా—అయ్యయో! యీరాత్రి యటు సేయవలదు
నెయ్యురు పలువుంద్రు నేఁడు వేడుకను
గనుటకై యిచటకుఁ జనుదెంత్రుగాన,
నిను వేఁడుకొనియెద నీయిష్టమైన
యంత యుత్సాహంబు నటఁ దెచ్చుకొనఁగ.
ఎంతయు నీకు మే లెనయునుగాక!
పనియున్న దిప్పుడు చనియెద నేను.

గ్రేషి—మునుమున్న 'లోరెంజో' మొదలైనవారిఁ
గనుఁగొన నేను నేగంగనువలయు;
చనుదెంతు మేము భోజనవేళ రాత్రి.

(అందఱు వెళ్ళుచున్నారు.)

3. రంగము—వినీసునగరము: షైలాకుగృహములోని గది.

[జెస్సికాయును, లాంసిలాటును ప్రవేశించుచున్నారు]

జెస్సి—విను నాజనకు నీవువిడిచి వెళ్ళుటకు
మనమున సంతాప మొనసెడు నాకు.
మాయిల్లు నరకంబు మహిమీఁద నాకు
నాయింట వర్తించునట్టిదయ్యంబ
వగుచును నీవుండి యాయాసభరము
నొగిఁ గొంత హరియింపుచుంటివి నీవు.
ఇదిగో నీకొకమాడ యిచ్చెద నేను;
ముద మొదవునుగాక ముందట నీకు!
ఔనోయి! నీక్రొత్త యజమానునింటఁ
దావల్ల 'లోరెంజో' తగ నేఁటిరాత్రి
భోజనములకును బోవునుగాన
నీజాబుఁ గొనిపోయి యీవు శీఘ్రంబ
యాతనికిని రహస్యంబుగ నిమ్ము;
ఈతీరునను నేను నీతోడ మాట
లాడుట నాతండ్రి చూడంగఁ దగదు;
తోడనె యటుగాన తొలఁగిపొమ్మీవు.

లాంసి—కన్నియరో! ఆజ్ఞఁ గైకొందు నేను.
కన్నీరు నాలుకఁ గదలుపనీదు.
ఓ సుందరీమణి! యోనాతిమిన్న!
మోసంబు నటియించి ముందు క్రైస్తవుఁడు
నిన్నుఁ గైకొనకున్న, నే వెలియాదు.
నన్నుఁ బంపుము; నాదుకన్నీటివఱద

ముంచె నాఘనధైర్యమును మొదలంట.
మంచిది! సెలవిమ్ము; మఱిపోయివత్తు.

జెస్సి—నీకు మేలగుఁగాక! నీ వేగవచ్చు.

(లాంసి॥ వెళ్ళెను)

(తనలో) నాకెంతపాపంబో నాతండ్రి కేను
దనయనంచును జెప్పుకొన సిగ్గుపడెద.
జననంబుచేత నాతనికూఁతునైన,
గుణములచేతను గూఁతురఁ గాను.
ఘనుఁడ 'లోరెంజో' వాగ్దానంబు నీవు
చెల్లింతువేని, నాయుల్లముతోడ
నల్లవపోరాట మంతంబుచేసి,
'క్రైస్తవు' రాలనై ఘనమోహాభరము
విస్తరింపఁగ నీదుప్రియభార్య నౌదు.

(నిష్క్రమించెను)

---

౪. రంగము—వెనీసునగరము; ఒకవీధి.

[గ్రేషియానో, లోరెంజో, శాలారినో, సోలానియో
ప్రవేశించుచున్నారు]

లోరెం—మేము భోజనవేళ మెల్లఁగా జాఱి
మామందిరంబున మాఱువేషముల
ధరియించి, సర్వంబుఁ దగ గంటలోనఁ
బరిపూర్తి గావించి మరల వచ్చెదము.

గ్రేషి—మనము చేయఁగ లేదు మంచియత్నమును.

శాలా—మనమింతవఱకును మాటాడలేదు

వచ్చి కాగడఁ బట్టువారల నైన.
హెచ్చరికను ముందె యెల్ల కార్యముల
సన్నాహ మొనరించి సలిపినఁదక్క,
తిన్నఁగా నుండదు! మున్నట్టిపనికిఁ
బూనుకొనుటకంటెఁ బోవ కావంగ
మానుట మేలు నామతమునుబట్టి.
నాలుగుగంట లైనది; సిద్ధపడఁగఁ
గార మింకను రెండుగంటలు గలదు.

[ఒక లేఖ చేతఁబట్టుకొని లాంసిలాటు ప్రవేశించు చున్నాఁడు.]

ఉన్నవె శుభవార్తలో 'లాంసిలాట!'
లాంసి—మన్నించి యిది మీరు మఱివిప్పిచూడ,
తెలుఁగంగఁబడునని యెంచెద నేను.
లోరెం—ఎఱుఁగుదు నీవ్రాఁత యెవరిదో నేను;
సత్యముగా నిది చక్కనివ్రాఁత.
అత్యంతధవళిమ నలరారుఁ జుమ్మీ
త్రాణమై నీకాగితంబునకన్న
దీని వ్రాసినవారి దేహంబు కాంతి.
గ్రేషి—వలపుసందేశముల్ వాస్తవంబుగను.
లాంసి—సెలవు నాకును దయచేసెదరయ్య!
లోరెం—ఎక్కడి కేగెద విప్పుడు నీవు ?
లాంసి—నిక్కము నాతొంటి నేత యైనట్టి
'యూదుని' విందున కొప్పించి రాత్రి
యాడట నాక్రొత్తయజమాను నింటి
కిని బిల్చుకొని రాఁగఁ జనుచున్నవాఁడ.

లోరెం—కొనుము దీనిని; బుచ్చుకొమ్మదె నీవు.

(సొమ్మిచ్చెను.)

తప్పక యామెపై దయతప్ప ననుచుఁ
జెప్పుము నాప్రియ 'జెస్సికా' తోడ;
అరిగె చెప్పుము రహస్యంబుగ దీని

(లాంసి॥ వెళ్ళెను.)

పరమాప్తులార! మాపటికి మీరెల్ల
సఖునియింటను నేఁడు జరుగు పండుగకు
ముఖముల ముసుఁగులు పూనివర్తింప,
వలయుప్రయత్నముల్ సలుపుడు రయ్య !
కలఁడు నాకొక్కఁడు కాగడవాఁడు.

శాలా—నడతుఁదిన్నఁగను గాగడవానికొఱకె.

సోలా—వడిగ నేనును బోయి వత్తునాపనికె.

లోరెం—అగిగిగంటకు 'గ్రేషియానో'ను నన్ను
మరల నీతనియింట మఱిగూడుకొనుఁడు.

శాలా—మంచిది మేమల్లె మరలఁ గూడెదము.

(శాలారినో, సోలానియో వెళ్ళుచున్నారు.)

గ్రేషి—పంచెనె యిప్పు డీపత్రికనీకుఁ
బ్రియురాలు 'జెస్సికా' ప్రేమమీఱంగ ?

లోరెం—ప్రియుఁడ ! నీకంతయు వినిపింపవలయు.
తనతండ్రి మందిరంబుననుండి తన్నుఁ
గొనిపోవ నెట్లుచేకూడునో నాకు,
తనవెంటఁగొనితేరఁ దగ నెన్నినగలుఁ
గనకంబు సిద్ధముగా నుంచినదియొ,

తా మాఱువేషంబు ధరియించుకొనుచు
నేమాడ్కిఁ గూర్చెనో భృత్యవస్త్రముల,
నాయుత్తరంబున నన్నియుఁ దెల్పె.
ఆయింతికిని దండ్రియైన 'యూదుండు'
సుగతినొందఁగ శక్తుఁడగు నేని, సాధ్వి
యగు కూఁతుబట్టియే యగునిశ్చయముగ;
పతితుఁడా 'యూదు'ని సుత యను నెపము
కతనఁ దక్కఁగ నన్యకారణంబునను,
దురదృష్ట మెప్పుఁడు దొయ్యిలికాలి
సరసకైనఁ దెగించి చనుదేరకుండు.
చనుదెమ్ము నాతోడఁ జనుదెమ్ము; దీని
జను చుండునప్పుడు చదువుము గాని.
అందకత్తెయయైన యా 'జెస్సికా' యె
ముందు కాగడ నాకు ముదముతోఁ బట్టు.

(అందఱును వెళ్ళిరి.)

---

౫. రంగము—వినీసునగరము; షైలాకుగృహము ముందర.

[షైలాకు, లాంసిలాటు ప్రవేశించుచున్నారు]

షైలా—చాలవృద్ధుండగు 'షైలాకు' నకును
శాలుఁడై యున్నట్టి 'బస్సానియో' తోఁ
గలభేదమంతయుఁ గన్నులనిండఁ
దిలకింపఁగల వీవె తెల్లంబుగాను—
ఏమె యో 'జెస్సికా'! ఏమె యమ్మాయి!
నామందిరంబున నను లేదునట్లు

గా మితితప్పి యాకడద్రిమ్మంగఁదగదు—
ఏమెరో 'జెస్సికా'! ఏమె అమ్మాయి!—
ఖూరికి గుఱువెట్టి గుడ్డలనెల్ల
నూరకయుటఁ జింపుకోరాదు నీవు—
ఏమె 'జెస్సిక'! పల్క వెంతపిల్చినను!
లాంసి—ఏమమ్మ 'జెస్సికా'! ఇటకురావమ్మ.
షైలా—నినుఁబిల్వుమని యేరునియమించినారు!
నినుఁ బిల్వుమంచును నేఁ జెప్పలేదు.
లాంసి—ఎప్పుడునా చేత నేపనిగాని
చెప్పించుకోనిదె చేయవీవంచు
మీరనుచుండెడివారు కాబట్టి
యీరీతిఁ బిలిచితి నిప్పుడు నేను.

[జెస్సికా ప్రవేశించుచున్నది]

జెస్సి—పిలిచినారేనన్ను? సెలవేమి యిపుడు?
షైలా—పిలువంగబడితిని విందునకేను.
అవె నాదు తాళము చెవులు జాగ్రత్త—
(తనలో) అవు నేల యచటికే నరుగంగవలయు!
ప్రేమంబుచే నన్నుఁ బిల్వఁగా లేదు;
నామోముముందఱ నన్నుస్తుతింత్రు;
అయినను బగచేత నరిగెద నేను
వ్యయమత్యధికముగా నటుచేయునట్టి
వెడఁగు 'క్రైస్తవు' సొమ్ము వెచ్చపెట్టంగ
(ప్రకాశముగ)
పడఁతుకరో! యిల్లుభద్రమ్మసుమ్మి—

(తనలో) ఏగ నాకింతయు నిష్టంబు లేదు;
జోగుచు సొమ్ముసంచులఁ జూచినట్లు
చనినరే యేను దుస్స్వప్నంబుఁ గంటిఁ
గనుక, నామది కేమొకలఁత రాఁగలదు.

లాంసి—తగదిట్టు; ప్రార్థింతుఁ దరలుము వేగ;
మిగుల నెదురుచూచు మీరాకకోరి
యిగ బాలుఁడైన నాయేలిక యిపుడు.

షైలా—తగదిట్టు; నాకు నవగతంబె సుమ్ము.
లాంసి—వారంద ఱొకటిగాఁ జేరియున్నారు;
బూరటిల్లెడు దొంగముఖములవారి
నీవు చూచెదవంచు నేఁ జెప్పఁజాను.
నీవు చూచెదవేని; నిజముగా నల్ల
సోమవారమునాఁడు సూర్యోదయమున
నాముక్కు బెదరుట సమ్ము మూరకయె
పోలేదు; బూడిద బుధవాసరమున
నాలు గేఁడులకిృంద నావత్సరంబు
వెలయఁగా మధ్యాహ్న వేళను వచ్చె.
షైలా—కలదుగా మాఱు మోముల వేడ్క నేఁడు!—
వినుమోసి 'జెస్సికా'! బీగము వ్వేసి
మునతల్పు లెల్లను మఱిమూసియుంచు;
తుడుములరొదలును, మెడమేలిదిృప్పి
చెడుగుఁబిల్లనగ్రోవి వడినూఁదువారి
వెడకీఁచు రొదలును, విన్నప్పు డీవు
వడి గవాక్షముల కెక్క వలవదు సుమ్ము;

పలురంగులాననంబుల నిండఁ దాల్చు
తెలివిమాలిన 'క్రైస్తవులఁ' జూచుకొఱకు
వెలఁదుకరో! రాజవీథులయందుఁ
దలఁజూపఁబోకుమీ తలుపులు తెఱచి
మనయింటికర్ణంబులను మూసిపెట్టు,
మనగవాక్షము లంచు మద్భావమమ్మ.
పనికిమాలినపిచ్చి పనులశబ్దంబు
మనసాధుమందిరంబునం జొరనీకు;—
(తనలో) 'జ్యాకబు' చేకఱ్ఱ సాక్షిగా రాత్రి
నాకుఁ గోరిక విందునకు నేగ లేదు;
ఏరీతి నున్న, నే నేగెద నేఁడు—

(లాంసి॥తో)

ఓరోరి! ముందుగా నొక్కట నడచి
యరుదెంతు నే నిప్పు డని చెప్పు మీవు.

లాంసి—అరిగెద ముందుగా నిచటికి నేను

(జెస్సికాతో)

ఇప్పుడు నీతండ్రి యెంత చెప్పినను,
దప్పకుండ గవాక్షతటినుండి నాకు—

(హయగతి రగడ)

ఒనరఁ దన్ను 'యూదురాలు'
కనిన మెప్పు గనఁగఁ జాలు
ఘనుఁడు మేటి 'క్రైస్తవుండు'
వనిత! యందు వచ్చియుండు. (లాంసి॥ వెళ్ళెను)

షైలా—పనికిమాలిన యుల్లబానిసకొడుకు

నిన్నుఁజూచి యిప్పు డేమనుచున్నవాఁడు!

జెస్సి—మఱి యేమియును లేదు; "మంచిదేఁ జనుదు;
మఱవకుమీ నన్ను మాయమ్మ!" యనియె.

షైలా—చాన! యీజడుఁడు విశ్వాసియే యౌను;
కాని యారసిచూడఁ గడుతిండిపోతు;
స్వామికి లాభంబు వచ్చెడుపనుల
సోమరియై నత్తచొప్పునఁ బ్రాఁకు;
అడవిపిల్లిని మించి యధికంబుగాను
పడి నిద్రవోవును బగలునుగూడ.
సోమరిపోతులు చూడ నాయొద్ద
నేమాత్రము నదుక రెప్పు డట్లౌట,
నే నెడఁబాసెద వీని నిర్వ్యోడను;
వేనిఋణము గొన్నవిత్తము స్వేగ
పెచ్చు పెట్టుటకును వీఁడు తోడ్పడఁగ
నిచ్చ వాంఛింతునో యేనిప్పు డట్టి
వానివద్దకు వీనిఁ బంచుచున్నాఁడ.
ఔనె యో 'జెస్సికా'! లోనికిఁబొమ్ము;
నేను గ్రమ్మఱ వత్తు నిమిషంబులోన;
నేను జెప్పినయట్లు నీ వొనరింపు;
తలుపులు నీవు లోపల వేసికొమ్ము;
'బలముగా నెయ్యది బంధింపఁబడునో
చక్కఁగా నయ్యది సాధింపఁబడును.'
పొదుపుగా వాడెడు సదమలమతుల
వదల కీసామెత మదిఁబాయకుండు. (వెళ్లెను.)

జెస్సి—నాయాస వదలుము నాతండ్రి నీవు,
నాయదృష్టమునకు నలఁత రాకున్నఁ,
గోలుపోవుదు జనకుని నింక నేను ;
గోలుపోవుదు నీవు కూఁతుని నింక.

(నిష్క్రమించెను.

---

౬. రంగము—వెనీసునగరము ; షైలాకుగృహము ముంగలి.

[కృతిమముఖలుల ధరించుకొని గ్రేషియానో, శాలారియో ప్రవేశించు చున్నారు.]

గ్రేషి.—మనల నిక్కడ నిల్వఁ డనుచు 'లోరెంజో'
పనిచిన దీమంచిపంచనే సుమ్మి.
శాలా—అతఁడు వచ్చెడు వేళ యది మించిపోయె.
గ్రేషి.—అతఁడు కాలము తప్పు టత్యద్భుతంబు ;
గడియారమునకంటెఁ గడు ముందుగానె
వడిసెందుఁ గాముకుల్ పరుగువారెదరు.
శాలా—కాముకు లిలఁ దాము కామించువారి
ప్రేమను బడయంగ విను మొట్టమొదటఁ
బదిరెట్లు త్వరతోడఁ బరువెత్తివత్తు
రది లభించినపిదపను దానిఁ
జెడఁగొట్టుకొనకుండఁ జేరి కాపాడ
వడుగు లెన్నుచు నేగు నప్పటికంటె.
గ్రేషి.—నీవు చెప్పినదెల్ల నిక్కమ్మె సుమ్మి.
ఏనాఁడు విందున కేగి యచ్చోట
నాదిని గూర్చున్నయంత యాఁకటనె

మేదినిలో లేచు మెక్కిన వెనుక!
హయరత్నమే యది యభినవంబుగను
బయలు దేఱినపుడు పరుగెత్తునంత
జవసత్వములతోడఁ జనుదెంచు మరల
మివులఁ బరిశ్రాంతి మించినయపుడు!
వసుధలో వస్తుసంపాదనమునకు
నొసఁగెడుశ్రద్ధలో నొకయింతయైన
మనుజులు పడసిన వెనుకను వాని
ననుభవించుటకియ్య రదియేమొ కాని.
తరుణవయస్కచందంబున నొండెఁ
బొరిదుర్వ్యయము చేయుపురుషున ట్లొండె
ధ్వజపటంబులు దాల్చి స్వసముద్రసీమ
నిజముగాఁ బెనునౌక నెవ్వడి వెడలి
వగలజారిణిఁబోలు వాయువుచేతఁ
దగనెట్టు లాలింగితము చేయఁబడును!
కడకు సర్వంబును గణికను బోలు
చెడుగాలిచేతనె చెడఁగొట్టుకొనుచుఁ
జెల్లి కాలము కడు శిథిలంబులైన
తొల్లిఁటి యవయవస్తోమంబుతోడఁ
జినిఁగిపోయినచాపచేలలతోడఁ
బెనుపఱి విచ్ఛిన్నతను జాలఁబొంది
ధరదుర్వ్యయ మొనర్చునరుఁబోలి యోడ
మరల నెట్టులువచ్చి మనికిఁ జేరెడును!
శాలా—వెనుక నీకథ చాలవినిపింపవచ్చు

చనుదెంచుచున్నాఁడు, సఖుఁడ! 'లోరెంజో'

[లోరెంజో ప్రవేశించుచున్నాఁడు]

లోరెం—ఏగి, నెచ్చెలులార! యేనింత సేపు
జాగొనర్చుటకును క్షమియింపవలయు.
కనిపెట్టుకొనియుండఁగను మిమ్ము నాదు
పనియె చేసెనుగాని వినుఁ డేను గాను.
మీరు భార్యలకయి మిగుల వేడుకను
జోర వేషములకుఁ జొచ్చినయపుడు
దీనినిమిత్తముగూడ నే నింతతడవు
మానక కనిపెట్టి మఱి యుండువాఁడ.
ఈదారిఁ జనుదెండి; యిదిగో నామామ
'యూదుండు' వసియించి యున్నమందిరము.—
ఎవఁడున్నవా రహో! యింటిలోపలను?

[బాలుని వేషముతో జెస్సికా మేడమీఁద ప్రవేశించుచున్నది]

జెస్సి—ఎవరయ్య మీరు? మీ యెలుఁగును నేను
గుఱుఁతుపట్టితిఁగాని, మఱియింతసరిగ
నెఱుఁగుటకై మీఱు లెఱిఁగింపుఁడయ్య.
లోరెం—నీకూర్మి 'లోరెంజో'; నీమనోహరుఁడు.
జెస్సి—నాకూర్మి 'లోరెంజో' నామనోహరుఁడె
ఎవ్వనిమీఁద నాకింతకంటె
నివ్వటిలును గూర్మి నిశ్చయంబుగను?
నీదాన నిపుడు నే నౌనునో కానో
యే దేవుఁ డెఱుఁగును నీవు దక్కంగ!

లోరెం—వినునీవు నాదాన వనుటకునీదు
మనసును దేవుఁడు బెనుసాక్షులిపుడు

జెస్సి—ఇదె పట్టుకొనుఁడయ్య యీపెట్టెమీరు;
ఇదియిచ్చుబ్రతిఫల మీపడ్డశ్రమకు
మీరు నన్నీక్షింపలేరు కాఁబట్టి
యేరాత్రి యాటకు నెలమిచెందెదను
ఏమందునియ్యెడ నెంతయు సిగ్గు
సామాను వేషంబునకు నాకె పొడము
కామంబు గ్రుడ్డిది; కామాంధు లెందుఁ
దామెఱుంగఁగ లేరు తమదోషములను
వా రెఱుంగఁగఁజాలువా రౌదు రేని,
యీరీతి బాలు నాకారంబుదాల్చు
నన్నుఁజూచి మారుఁడై నను లజ్జపడును.

లోరెం—వనితరో! దిగిరమ్మ; వచ్చి కాగడను
బట్టువాఁడవుగఁ గావలయును నాకు.

జెస్సి—పట్టంగవలయుఁగా వచ్చి కాగడను
నాసిగ్గు వెల్లడి చేసికొనంగ?
నాసిగ్గె కాగడ నాసింపకుండ
వెల్లడియగుఁజుమీ యెల్లవారలకు
వెల్లుగఁ గాగడ వేసెడువాని
పనివెల్తు రొసఁగుట, గనుకఁ జీకటిని
గనరాక డాగంగఁ జనెదు నే నేల?

లోరెం—డాగి యున్నావు, చూడఁగ, సుందరాంగి!
బాగుగా నందమా బాలవేషమున

రారమ్మ వేవేగ; రాత్రియుఁ గూడ
జారుచున్నది సన్నసన్నగ నిపుడు;
ఘనులు 'బస్సానియో' గమనోత్సవమునఁ
గనిపెట్టియుందురు మననిమిత్తంబు.

జెస్సి—తలుపు లెల్లను వేసి ధన మింతగొనుచుఁ
గలిసికొందును దిన్నగా వచ్చి మిమ్ము.

గ్రేషి—నాదు శాటికతోడు! నళినాక్షి తోఁచు
'యూదుని' గాఁగాక యోగ్యజాతిదిగ.

లోరెం—ఈమెను మనసారఁ బ్రేమింప నేని
నే మతిహీనుఁడ నిజముగా నౌదు
తలఁచిచూడంగ నీతన్వంగి నాకుఁ
దెలిసినంతవఱకు ధీమంతురాలు;
రూపసంపన్న నా చూపునఁ జూడ;
కాపురంబు సుగుణగణములకెల్ల
కనుక నామదిలోనఁ గలకాల మామె
కనఁబడవలయును ఘనబుద్ధిమతిగ
వరరూపవతిగాఁగ బహుగుణాఢ్యగను.

[క్రిందనుండి జెస్సి కాప్రవేశించుచున్నది.]

(జెస్సితో) అరుదెంచితివె నీవు? హా స్త్రీంద్రయాన!
(మిత్రులతో) చనుదెండుపోదము సఖులార! మనము;
మనరాక నెదఁగోరి మాఱువేషములు
వేసినమిత్రులు వేచియుందురు.
(జెస్సికా, లోరెంజో, శాలారినో వెళ్ళుచున్నారు)

[ఆంటోనియో ప్రవేశించుచున్నాఁడు.]

ఆంటో—ఆసన్నముగ నెవ్వ రందున్నవారు !
గ్రేషి—ఓయి 'యాంటోనియో' ! ఓయి నీవయ్య !
ఆంటో—ఓయి ! ఛీ ! ఛీ ! పొమ్ము. నేఁడురి వ్వేళ
నెక్కడనున్నారు తక్కినవారు !
ఒక్కటఁ దొమ్మిదిహోర లిప్డయ్యె ;
నీకయి సఖులెల్ల నిలిచియున్నారు ;
ఈకొన్నయుత్సవ మీరాత్రి లేదు ;
అనుకూలగతివాయు వడరెడుఁగానఁ
జను నోడనెక్క 'బస్సానియో' యిపుడె.
అరసి నిన్గొనిరాఁగ నచ్చటచ్చటకు
నిరువదిమందిని నేఁ బంపినాఁడ.

గ్రేషి—అందున కెంతయు హర్ష మొందెదను ;
పొందుగాఁ బడవెక్కి పోయి యీరాత్రి
వెడలిపోవుటకంటె వేఱుగా నాకుఁ
బడయంగ దగినట్టిపండుగ లేదు.

(అందఱు నిష్క్రమించిరి.)

---

౭ రంగము—బెల్మొంటు గ్రామము ; పోర్షియాగృహములోనిగది.

[వాద్యములు మ్రోయుఁగా, పోర్షియయును, మొరాకో రాజపుత్రుడును తమపరివారముతోఁ బ్రవేశించుచున్నారు.]

పోర్షి—చని, కాండ పటమును జరపిపెట్టియలఁ
గనఁబఱువుము నీవు ఘనున కీదొరకు,

(మొరా॥ తో)

చని కోరుకొనుఁడయ్య చక్కఁగాఁజూచి
మనసువచ్చినదాని మనుజేంద్రపుత్ర !

మొరా—మిసిమిబంగారుపెట్టె మించును మొదటఁ
బసమీఱు నీక్రిందివాక్యంబుతోడ—
"నను గోరుకొనువాఁడు నరులు పెక్కండ్రు
మనసులోపలఁ గోరుకొనుదానిఁ బడయు"
ఇవుల రెండవదైన యీ వెండిపెట్టె
తవిలి యీక్రింద వాగ్దానంబు సలుపు—
"ననుగోరుకొనువాఁడు నరులలోపలను
తనయర్హతకు నేది తగు దాని బడయు."
మోటుసీసపుఁబెట్టె మునుతనయంత
మోటుహెచ్చరికతో మూఁడవదొప్పు.
"ననుగోరుకొనువాఁ తనకున్న దెల్లఁ
దనది కాననుకొని తగనియ్యవలయు."
ఇందులో నేనెట్టు లెఱుఁగుదు మంచి
మందసంబున కోరుకొందునో లేదో !

పోర్షి—క్ష్మానాథపుత్ర ! నాచక్కనిపటము
వానిలోపల నొక్కదానిలో నుండు ;
దానినే యిపుడీవు తగఁ గోరదేని,
నేను బటముతోడ నీదాన నగుదు.

మొరా—భగవానుఁడెవఁడైన బాగుగానాకుఁ
దగినయాలోచన దయచేయుఁగాత!
పొడగాంచఁగానిమ్ము పోయినన్నిప్డు ;

కడనుండి మొదటికిఁ గ్రమముగా వ్రాఁత
లాడటఁ బరికింతు నన్నియు మరల.
ఏదిసీసపుఁబెట్టె యేమిచెప్పెడును?
"ననుగోరుకొనువాఁడు తనకున్న దెల్లఁ
దవది కాదనుకొని తగ నియ్యవలయు."
దేనికై సర్వంబుఁ దెగువ నీవలయు?
హీననాగమునకా యియ్యంగవలయు?
బెదరించుచున్న దీపెట్టియ మిగుల
వదలిసర్వంబును వడినిచ్చువారు
తగినలాభముపొంద నగునన్నయాశ
దగిలిచేయుచునుంద్రు దామట్టిపనిని.
అరుగదు చిలుములోహంబుమీఁదికిని
బరఁగ బంగారంబువంటిమానసము,
కాన, సీసముకొఱ కేనాఁడు నేను
దేనిని నియ్యంగఁ దెగియింపకుందు
పదిలమాతనస్వచ్ఛవర్ణంబుతోడ
నిది వెండిపెట్టియ యేమిచెప్పెడును?
'ననుకోరుకొనువాఁడు నరులలోపలను
దనయర్హతకు నేదితగు దానిఁబడయు.'
తనయర్హతకుఁదగుదానినా పడయు?
మనసు! విచారింపుమా క్షణమాగి
పక్షపాతము లేక పాత్రతయెంత
దక్షతఁ గలదో యీధరణిపై నీకు;
నీదైనయెన్నిక న్నే చూతువేని,

యూదెంతకైనను నర్హాంబ వీవు.
ఆ యెంతకైనను నర్హాంబ వనుట
యూయింతివఱకును వ్యాపింప దేమొ.
అయిన నేనర్హుండ నౌదునా యనుచు
భయపడుటెల్ల నాశయిలేనిపోని
పెనుశోకంతను దెచ్చి పెట్టుకొంటగును.
తనర నాకెయ్యది తగు, దానినెకద?
నిస్సంశయముగ నానీరజాననయె
లెస్సఁగాఁ దగియుండు లీలమై నాకు
వరకులీనతచేత భాగ్యంబుచేత
సరససద్గుణరూపసంపదచేత
పెద్దలశిక్షను బెరుఁగుటచేత
తద్దయుఁ దగుదు నాతరుణికి నేను.
అన్నిటికంటె ముఖ్యంబుగ నామె
కెన్నంగఁ దగియుండు నేను ప్రేమమున.
ఇచ్చట నే యాగి యాపెట్టెఁ గోర
కెచ్చటికిని నేల యిఁక నేగవలెను?
అయిన నింకొకసారి యానువర్ణంబు
చయిని జెక్కినవ్రాఁత పరికింత మిపుడు
"ననుగోరుకొనువాఁడు నరులు పెక్కండ్రు
మనసులోఁ బలఁ గోరుకొనుదానిఁ బడయు,"
నరులుపల్వురుగోరునదియె యీయింతి;
అరయ నీమెను లోకమంతయుఁ గోరు.
మనుజావతారంబు గనినయీదివ్య

వనిత దేహమను దేవళము సేవింపఁ
గాముక జనులు నల్గడలయుండుండి
భూమిపై వత్తురు పూర్ణాశతోడ
అలరారు 'హార్కానియా' దేశమందు
వెలయు విశాలంపు విజనభూములును
'యువన' దేశపు దుర్గమారణ్యములును
యువతిఁ జూచెడు వేడ్క నూరకవచ్చు
రాజకుమారుల రాకనుబట్టి
రాజమార్గము లయ్యె రమణీయముగను
తనశిరస్సు మహోన్నతంబుగ నెత్తి
ఘనగర్వమునను స్వర్గముఖంబునందు
నుమ్మివైచెడునట్టు లూర్మికాళిక
రమ్ములు లేవఁ బరఁగుసముద్రుండు
నితరదేశీయుల కేతెంచుటకును
బ్రతిబంధకముగాక పసచెడి యుండె;
కావున జలధిని గాలువవలెనె
లావణ్యరాశి యీలలన దర్శింప
నవలీల దాఁటి వార రుదెంతు రటకు
ఇవె పెట్టియలు మూడు నిందులోఁగలదు
దేనిలోనో యీమె దివ్యపటంబు.
పూనునే సీసంబు పూర్ణేందుముఖి!
అపచారమగు హీనమా యట్టితలఁపు
నివు డించుకేనియు నెదఁ దలంచినను;
నల్లనైనసమాధిగాఁ జను దీవ

వెల్లడిగా నీమెప్రేతవస్త్రంబు
నైనను బెట్టుట యతిలాఘవంబు
ఈ నాతి పుటమిడ్డ హేమంబుకంటెఁ
బదిరెట్లువెల డిందుపడు వెండిలోనఁ
బొదుగంగఁబడియుండఁబోలునం చెంతు.
అట్టు తలంచుట హా! పాపముగును!
ఇట్టియమూల్య మైనట్టిరత్నంబు
హేమంబుకంటెను హీనమౌదాన
భూమిపై నెప్పుడుఁ బొదుగంగఁ బడదు.
తిలకింప 'నింగ్లాండు' దేశంబునందుఁ
గల దొక్క దేవతాకన్యరూపంబు
బంగారునాణెంబుపయిఁ జెక్కఁబడుచు
బంగారువెలుపటఁ బడియుండినదియును
కాని, యీ దేవతాకన్య యిచ్చోటఁ
దానున్నదీ హేమతల్పంబులోన—
ఇమ్ము బీగమ్ము నేనిదె కోరుకొందు,
నెమ్మొక్కడ్కి ఫలము నా కెసఁగినఁగాని.

పోర్షి—అదిగో రాజకుమార! యదె పుచ్చుకొమ్ము
పదిలముగా నాదు పట మందులోనఁ
గనఁబడ్డ, నీదానఁ గాఁగల నేను.

(అతఁడు బంగారుపెట్టె తాళము తీయుచున్నాఁడు)

మొ రా—ననుఁ జెఱిచితివె? హా! నాదు దైవంబ!
ఏల లభించిన దిక్కథ నాకు?
భీమమృత్యువుకొక్కపీనుఁగు దొరకె.

కట్టుగా వ్రాసిన కాగిత మొకటి
చుట్టియున్నది దీనిశూన్య నేత్రమున,
అదివుచ్చుకొని విచ్చి యందేమిగలదో
చదివెద నంతయు సరిగాను నేను.

(ఇట్లు చదువుచున్నాఁడు)

(తేటగీతములు)

"మహిని మెఱసెడిదెల్ల హేమంబుగాదు;
పలుమఱును జెప్ప నిదివిన్నవాఁడవౌదు;
పలువురమ్మిరి తమదుజీవములు నాదు
మీఁదిరూపంబుఁ గనుటకే మిథ్యగాదు.
పుత్తడిసమాధులకు లోనఁ బురుగులుండు;
ఎంతధైర్యవంతుడవో యంతనిండు
బుద్ధిమంతుఁడ వయినను, బుడమి మెండు
కాయపాటవమును నీవు గలిగియుండు
చందమునను యాలోచన చాల నుండు
వాఁడవయినను, నీకిట్టిబదు లొకండు
వ్రాయఁబడి యెంతమాత్రంబు రాకయుండు;
పోయెమీకృషి; యిఁకనాజ్ఞ పుచ్చుకొండు."
పోయె నిశ్చయముగఁ; బూనికయెల్ల
నాయది విఫలమై నడచె నియ్యెడను
చిన్నమ్మవారు తా సెలవు గైకొనఁగ,
వెన్నడి నన్నుఁ జేరెఁ బెద్దమ్మవారు—
సెలవిమ్ము యో పోర్షియా! చిరముగా నిలిచి
సెలవుఁ గైకొన మిదిచెదరి యున్నాఁడ.

ఇల యత్నవైఫల్య మొనయువారెల్ల
సెలవు నీరీతినే చేకొందు రెపుడు.

[వాద్యములు మ్రోయఁగా పరివారముతో వెళ్ళుచున్నాఁడు]

పోర్షియా—(తనలో) చక్కఁగావడలె నీ జనవల్లభుండు;
తక్కిన యితనిచందమువార లెల్ల
నీరీతినే వరియింతురు గాక!
(సేవకునితో) ఓరి! నీవా తెర నొగివేసిరమ్ము.

(అందఱు నిష్క్రమించుచున్నారు)

---

౮. రంగము—వినీసుపురము; ఒక వీధి.

[శాలారినో, సోలానియో ప్రవేశించుచున్నారు]

శాలా—'బస్సానియో' యోడపయి నెక్కిపోవ
నిస్సంశయంబుగ నేఁ జూచినాఁడ;
ప్రీతిమై 'గ్రేషియానో' తానుగూడ
నాతనితోడనె యరిగినవాఁడు.
వార లెక్కినయోడపయిని 'లోరెంజో'
యే రూఢిగా నిప్పు డెఱుఁగును లేఁడు.

సోలా—చెడుగు 'యూదుఁడు' రాజుఁ జేరంగఁబోయి
పాడిపాడియేడ్పులఁ బురికొల్పె తన;
నౌకయందు 'బస్సానియో' యోడ వెదక
వెడలె వానినిగూడ వెంబడిఁగొనుచు.

శాలా—ఆలస్యముగ వార లరిగిరిగానఁ
జాలదూరము పోయె సాగి యాయోడ.
కాని, విచారించి క్ష్మానాథుఁ డచటఁ

దానల్ల 'లోరెంజో' తనమోహనాంగి
యగు 'జెస్సికా' తోడ నరిగె వేళొక్క
తగునోడలోనని దళుత నెఱిఁగె;
అదియునుగాక వారాయోడలోన
సదుపాయముగను 'బస్సానియో' తోడ
లేరు చూచితినంచు లిఖితరూపమునఁ
జేరి, 'యాంటోనియో' చెప్పె రాజునకు.

సోలా—పఱచుచు వీధులఁబడి కుక్కకరణి
నఱచెడి 'యూదుని' యఱవులవంటి
వివిధంబులై నవి వింతయైనవియు
నవకరంబైన వవ్యక్తమైనవియుఁ
బెడబొబ్బ లెందును వినియుండలేదు
పుడమిపై నింతకుమునుపు నేనెపుడు
"హాసుత! హాసొమ్ము! హానాకుమారి!
ఓసి! క్రైస్తవు' తోడ నొకటఁబోయితివె!
నాదు 'క్రైస్తవ' కాంచనంబ! ధనంబ!
ఏదిన్యాయంబు! మఱేది దండనము!
మాడలు! కూఁతురు! మఱిముద్రసంచి
మాడలసంచులు మంచివి రెండు!
చక్కనైనవరాలసంచు లారెండు
నక్కట కూఁతుచే హరియింపఁబడియె,
నగలును మేలిరత్నంబులు రెండు!
జగజంపువెలహెచ్చు రాతిరత్నముల
హరియించె నారెంటి హానాతనూజ;

సరిసరి! న్యాయంబు! సతి వెతకుండు;
మానికంబులు నాదు మాడలన్నియును
దానియొద్దనె యుండు, దథ్య’’ మంచఱచు.

శాలా—“వానిరత్నంబులు! వానికొమార్తె
వాని మాడ’’ లటంచు వడి ‘వినీసు’ నను
గలబాలురందఱుఁ గడునెగతాళి
సలుపుచు వెంబడిఁ జనుచున్నవారు.

సోలా—తనగడువునుగూర్చి తగుశ్రద్ధపుచ్చు
కొనియె ‘మాంటోనియో’ క్రమ్మఱవలయు;
అటుసేయకుండిన నాతనిపయి నె
య్యెటులైనఁ బడుజుమ్మి యీసొమ్ముకూడ.

శాలా—కడుచక్కఁగా జ్ఞాపకంబుచేసితివి;
వడి నిన్న నొక ‘ఫ్రెంచి’ వానితో నేను
జేరి ప్రసంగంబు చేయుచునుంటి;
కూరిమినతఁడు వ్రాకుచ్చె నాతోడ
నెడఁబాపి ‘ఫ్రాన్సు’ ను ‘నింగ్లాండు’ తోడ
నడుమనున్న యిఱుకు కడలిలోపలను
మన దేశనౌకయె మంచివస్తువులఁ
గొనివచ్చినది యొండు క్రుంగెనటంచు.
అతఁ డది చెప్పుచున్నపుడు నామదికి
సతత ‘మాంటోనియో’ స్మరణకు రాఁగ
ఘనుఁ డాతనిది యదికాకుండుఁ గాక
యనుచు నీశ్వరు లోఁ ధ్యానించినాఁడ.

సోలా—ఇప్పుడు నీవిన్నదెల్ల నాతనికిఁ

చెప్పుటయే చాల శ్రేయస్కరంబు !
అయినను జెప్పుదు నాకస్మికముగ
భయదమనోవ్యథపా లగుఁగాన.

శాలా—కరుణాళుఁ డాతనికంటె నొండొకఁడు
ధరణిపై జననమొందంగను బోఁడు ;
అతఁడు 'బస్సానియో' నంపినయట్టి
వితమేను దఱినుండి వీక్షించినాఁడ.
'చని సత్వరంబుగఁ జనుదెంతు మరల'
ననుచు 'బస్సానియో' యన్నప్పు డతఁడు,
"ఆరీతిఁ ద్వరపడి యరుదేరవలదు ;
ఆరయ నాకొఱకచట నీపనిని
జెడఁగొట్టుకొనకు కొంచియమైన నీవు;
కడముట్టఁ గార్యసంఘటన మాఁదాఁక
నిలువుమీ తఱివేచి నిశ్చలమతిని.
చెలికాఁడ ! వినుమేను జెడుగు 'యూదు'నకు
వ్రాసి యిచ్చినయట్టి పత్రంబుమాట
కాసంతయును మోహకలితమైయుండు
నీమానసంబున వెలకొన నీకు ;
నీమది నెలకొల్పు నిత్యమోదమును.
అచ్చటఁ గడు నీకు నర్హమౌనట్టి
మచ్చిక ఘటియించు మార్గంబులందు
వరియించుపనియందుఁ ద్వన్మానసంబు
చరియింపఁ జేయుము సతతంబునచట"
అనుచుఁ బ్రత్యుత్తరం బఱిదయు నిచ్చె.

కనులనెంతయు నీరు గ్రమ్మంగ నచట
సయిత మాస్యము వెన్కచక్కికిఁ ద్రిప్పి
కరమును వెన్కకై చాచి స్నేహితుని
చేతిలోఁ జెయివైచి సెలవు గైకొనియె
నాతఁ డత్యద్భుత వ్యసనంబుతోడ.

సోలా—అతనితోడిదలోక మనియుండు నతఁడు;
అతివేగముగఁ బోయి యతని దర్శించి
మనసులోపలికుందు మానెడునట్లు
మనమింత వేడుకమాట లేవైనఁ
బలుకంగ వలయును ; ప్రార్థింతు రమ్ము.

శాలా—సలుపుద మాలాగె చనియింక మనము.

(అందఱు నిష్క్రమించు చున్నారు.)

---

౯. రంగము.—బెల్మొంటు గ్రామము ; పోర్షియగృహములోని గది.

[ఒక సేవకునితో నెరిస్సా ప్రవేశించు చున్నది.]

నెరి—క్రన్నన నరుదెమ్మ · కరుణించి వచ్చి
తిన్నఁగా వేగంబ తెరదీసి పొమ్ము.
'అరగాన్' నృపపుత్రుఁ డదె ప్రమాణంబు
పేరిమి నొనరించి పెట్టెలఁ గోరఁ
జనుదెంచుచున్నాఁడు సరగ నీక్షణము.

[వాద్యములు మ్రోయుఁగా, అరగాన్ రాజపుత్రుడును,
పోర్షియయును తమపరివారముతో ప్రవేశించు చున్నారు.]

పోర్షియ—కనుము పేటికలవె, త్మనాధమౌళి !
నాపటమున్నట్టి యాపెట్టె నీవు

రూపించి యిపుడు కోఱుకొనుదు వైని,
మనవివాహము చెల్లు మాటలోపలను;
మనుజేంద్ర ! నాకడ మాటాడ కింక
నిక్కడనుండి నీ వేగంగవలయు
గ్రక్కునఁ, దగుపేటికను గోరవేని.

ఆర—ఏపెట్టె యనుబోయి యేమగోరుదునో
యాపెట్టెయను జెప్ప కట్టె యుండుటకు,
తప్పుపెట్టెయఁ గోరి తాఁకితి నేని
యెప్పుడుఁ బెండ్లికై యింకొకసతిని
జీవించినన్నాళ్ళుఁ జేరకుండుటకు,
దైవవశంబునఁ దప్పినయెడల
సెలవును నీయొద్దఁ జెచ్చెరఁ గాంచి
పలుకరింపక నిన్ను వదలి వెళ్ళుటకు,
మానకేఁ జేయుప్రమాణంబుఁ బట్టి
నేను బద్ధుఁడ నౌదు నిశ్చయంబుగను.

పోర్షి—పనికిమాలిననన్ను వరియించుకొఅకుఁ
జనుదెంచువారెల్ల వనటకు నోర్చి
యీమూడువిధులను నెపుడుఁ జెల్లింపఁ
దాము ప్రమాణంబుఁ దగఁ జేయుచుంద్రు.
ఆర—అటుచేసి నే సిద్ధమై యున్నవాఁడ.
తటుకున నావాంఛితములకు దైవ
మిఁకమహి సాయమయ్యెడుఁ గాకయిష్ట !
హేమంబు, రజతంబు, హీనసీసంబు.
"నను గోరుకొన్నవాఁడు తనకున్న దెల్లఁ

దనది కాదనుకొని తగ నియ్యవలయు."
నీనిమిత్తము దేని నే నీకముంచు
కాన రావలె నీవు కరమింపుగాను.
ఏమని చెప్పునో హేమపేటికయు
దీమసంబున నన్నుఁ దిలకింపనిమ్ము.
"ననుగోరుకొనువాఁడు నరులు పెక్కండ్రు
మనసులోపలఁ గోరుకొనుదానిఁ బడయు"
పెక్కండ్రు మది నేది కోఁరుచుండుదురు ?
'పెక్కండ్రు?' నాఁగను వెడఁగునేత్రంబు
కనఁబఱచెడుదానికంటె మఱేమి
కనుఁగొనశక్తులు గాకుండ నుండి
వెలిమెఱుంగునకును వెస మోసపోవు
తెలివిమాలినపామరులమూఁక యేమొ ;
వారలదృష్టి లోపలికిని జొరక,
ఘోరకష్టంబులు గూరెడిచోట
బట్టబైటను వెలుపలిగోడమీఁద
నెట్టనఁ దనగూడు నిర్మించునట్టి
గిజిగానిఁ బోలును గేవల మెవ్వడు.
ప్రజలు పెక్కండ్రురు వాంఛించు దాని
నే నెన్నఁడును గోర నిశ్చయంబుగను
ఏను సామాన్యుల నెల్లరఁ గలిసి
యామూర్ఖజనులతో నత్యంత మేను
భూమిపై సమతను బొంద నెప్పుడును.
ఈయూహ లన్నియు నేటికి నాకు ?

నీయొద్దకును నిదె నేను వచ్చెదను
ఓ వెండిపెట్టె ! యింకొకసారి చెప్పు
నీ వేమి ధరియించినావో నీపయిని.
"నను గోరుకొనువాఁడు నరులలోపలను
దనయర్హతకు నేది తగు దానిఁ బడయు"
పలుకుచున్నది యిది బాగుగాఁగూడ.
ఇల దనకర్హత యేమియు లేక
దైవంబు నొక్కటఁ దగ మోసపుచ్చి
యేవాఁడు భాగ్యంబు నెనయ యత్నించు!
తనయోగ్యతకు మించుఘనతను బూని
యెవర నేఁడుఁ దెగింపకుండునుగాత !
ఉన్నతపదవులు నుద్యోగములును
జెన్నగు బిరుదులుఁ జెనుమార్గమునను
బడయకుండిన నెంత బాగుగా నుండు !
కడుగొప్పతనమును గాంచెడువాఁడు
తనపాత్రతనుబట్టి వాసిని దాను
గనుచునుండిన నెంత ఘనముగా నుండు !
అప్పగిదినె లోకమం దుండునేని,
యిప్పుడు టోపీల నెందఱు తీసి
ప్రబలులకడ నిల్వఁబడి యుండువారె
ప్రబలులై టోపీలు బలిమిఁగూర్చుండ్రు !
యజమానులయి యుండువా రెందఱిపుడు
భజియింపుచుండ్రు సేవకులౌచుఁ బరుల !
ఘనులయి యిప్పుడు కనఁబడునట్టి
మనుజులల్లోనుండి యిమ్మహి నెంతమంది

హీనమానవులుగా నేర్పడఁగలరు !
హీనులై యొకమూల నేర్పడకుండఁ
గాలవిపర్యాస కారణంబునను
గూలి యూరును బేరుఁ గోల్పడినట్టి
వారిలో నెందఱు బాహ్యగౌరవము
వారక ధరియించి వెలుఁగఁగలరు ?
మంచిది ! యిటువంటిమాట లేమిటికి ?
ఎంచి కోరెదుపని నేఁ జూచుకొందు.
"నను గోరుకొనువాఁడు నరులలోపలను
దనయర్హతకు నేది తగు దానిఁబడయు."
అనుకొందు నేఁ గడునర్హుఁడనంచు.—
వనిత ! దీనిచెవిని వడిగ నాకిచ్చి,
దాన నాభాగ్యంబు తనరునో యెట్లు
కానిపింపఁగనిమ్ము క్షణములోపలను.
(వెండిపెట్టెతాళము తీయుచున్నాఁడు)

పోర్షియ—ఇది యేమి? భ్రమగొని యిట్లింతతడవు
కదలకుండితి విందుఁ గానుదాని కీవు,

ఆర—ఏమి గాన్పించెడు నీపెట్టెలోన ?
ఏమేమొ వ్రాసినయీచీటి నాకు
నిచ్చుచుఁ, గన్నుదోయిని జికిలించు
పిచ్చివానిపటంబు పెంపొందు నిందు.
చక్కగా దీనిని జదివెద నేను—
ఎక్కడ బోర్షియ? నీరూపమేడ?
నాకోరికలను నాయర్హతను
నీకును సామ్యంబు నెక్కడిది లేదు.

'ననుగోఁకొనువాఁడు నదులలోపలను
దనయస్వాతకు నేదితగు దానిఁబడయ"
ఈ వెఱ్ఱితలకంటె' నెక్కువదాని
కీవేళ నస్వాండ నే నిందుఁ గానె!
ఇదియె నా బహుమతి! ఇంతటికన్న
నదనంబునకును నాకస్వత లేదె!

పేర్ష్య—నేరంబు సేతఁయు నెవ్వడిఁదీర్ప
తీరుచుటయు వేఱువేరైనపనులు
ఏమాత్రముఁ బొసంగ వితరేతరమును.

ఆర—ఏమియున్నదొయిందు నేనుజూచెదను

(తేటగీతములు)

"ఏడుకాఁక లగ్నిని దీతె నిది కర్మమ్ము;
తప్పు నెపుడుఁ గోరనిబుద్ధి తా భ్వశమ్ము
నేడుకాఁకలు దీజె వెంపెసఁగుఁ జుమ్ము
నీడనే కొంద ఊసింత్రు నిక్కువమ్ము;
అట్టివారొంకుదురు నీడయానుఖమ్ము;
బుద్ధిహీనులు వయిపయిపూఁత లిమ్ము
గాము గలవార లెఱుగుదుఁ గలరునుమ్ము;
ఇందు నారీతి నున్న దీమందనమ్ము
ధరణి నెవ్వతెనైనను బరిణయమ్ము
కమ్ము, నీవు వివాహమ్ము కాకపొమ్ము,
నీశిరస్సునె యయియుందు నేసతమ్ము
వచ్చినట్టినీపసిదీతె; వడిగఁ బొమ్ము"
తడవుగా నిఁక నిందుఁ దగ నిల్తునేని,
నెడఁగు నా[illegible]మతింత విశ్వంబులోన

తెలివిమాలినవాని యొక్క తలతో వరింప
వలెనని చనుదెంచి, తలలట్టివానిఁ
గాని రెంటి నిప్పుడే జనుచున్నవాఁడ.
పనివిని మొదనమ్మ, ప్రాణవల్లభరో!
ఏను బొందినశ్రమ మెల్లను మఱచి
నేను జేసినబాస నెఱవేర్తుఁ జూవె.
(అరగాన్ రాజపుత్రుఁడు పరివారముతో వెళ్ళెను

పోర్షియ—వ్రాలి దీపముమీఁదఁ బుఱురంగుచూచి
కాలె నీశలభ మీకరణి నియ్యెడను
అతిబుద్ధిమంతులయట్లు నటించు
మతిహీనులగువీరు పని దేనినైనఁ
గోరునప్పుడు తమగొప్పధీమహిమ
నార కార్యము చెడునట్లు కోరుదురు.

నెరి—వినుము 'చావును బెండ్లి విధిచేత నౌదవు'
ననుతొంటిలోకోక్తి వ్యర్థంబుగాదు.

పోర్షియ—పడఁతిరో! యీకాండపటమును నీవు
వడి మూసివేయుమీ వచ్చి యిక్కడకు
[సేవకుఁడు ప్రవేశించుచున్నాఁడు]

సేవ—ఎచట నాయమ్మగారిపుడున్నవారు?

పోర్షియ—ఇచట నున్నావేమి? యిదె యయ్యగారు!

సేవ—అమ్మరో! తనస్వామి యాగమనమ్ము
నిమ్ముగా మీతోడ నెఱిఁగించుకొఱకు
నరుగుదెంచి 'వినీసు' పురవాసి యొకఁడు
తరుణవయస్కుఁడు తాను వాఁకిటను
నిలుచుండియున్నాఁడు; నిరుపమగతిని;

అలఘుఁ డాతఁడు దెచ్చె యజమానుఁ డంపఁ
బలుదీవనలు ప్రియవాక్యముల్ గాక
వెలలేని కానుకలు వివిధముల్ కూడ
వలపువార్తను దెచ్చువారిలో నెపుడు
నిలునింతసరసుని నేఁ జూడలేదు
రాగలట్టివసంతరామణీయకముఁ
దాఁ గనఁబఱుప ముందరవచ్చునట్టి
చైత్రదినంబును, స్వామికిముందు
నేత్రోత్సవంబుగ నేఁడిచ్చుటికిని
వచ్చినయీదూతవలె నింపు కైన
ముచ్చటగా నుండి ముదమియ్య డెపుడు.

పోర్షి—విరమింపుమింతట వేఁడెదనిన్ను;
కరము నీవాతనిఁ గైవార మిపుడు
చేయుచందముచూడఁ జెప్పుచు వేమొ
నేయుఁడంచును నీకు నే భయంపడెద
రమ్ము 'నెరిస్స'! శీఘ్రంబుగఁబోయి
యమ్మాడ్కి రసికత యచ్చుపడంగఁ
జనుదెంచినట్టియామనసిజుబంటుఁ
గనుఁగొన నెంతయుఁ గాంక్షింతు నేను.

నెరి—మతి కిష్టమేని, యామన్మథుఁడైన
యతఁడు 'బస్సానియో' యయ్యెడుఁగాక!

(అందఱు నిష్క్రమించు చున్నారు)

సంపూర్ణము

జాన్స్ ముద్రాక్షరశాల, రాజమహేంద్రవరము—1950.

కీ ర్తి శే షు లై న రా వు బ హ ద్దూ రు

కందుకూరి వీరేశలింగం పంతులుగారి గ్రంథములు.

ప్ర హ స న ము లు

మొదటి సంపుటము

1 అపూర్వ బ్రహ్మచర్య ప్రహసనము
2 విచిత్ర వివాహ ప్రహసనము
3 మహాబధిర ప్రహసనము
4 పునర్మ్మరణ ప్రహసనము
5 బలాత్కారగానవినోద ప్రహసనము
6 కలహప్రియా ప్రహసనము
7 మహామహోపాధ్యాయ ప్రహసనము
8 యోగనిద్రా ప్రహసనము
9 మహావంచక ప్రహసనము
10 అసహాయశూర ప్రహసనము
11 కలిపురుషశనైశ్చర విలాసము
12 వేశ్యాప్రియా ప్రహసనము
13 కౌతుకవర్ధని
14 హాస్యసంజీవిని మొ॥భా॥
16 ,, రెం॥భా॥
17 ,, మూ॥భా॥

నా ట క ము లు

రెండవ సంపుటము

1 బ్రాహ్మవివాహము
2 వ్యవహార ధర్మబోధిని
3 తిర్యగ్విద్వన్మహాసభ (మూషకాసుర విజయం)
4 మహారణ్య పురాధిపత్యము
5 ప్రహ్లాద నాటకము
6 సత్యహరిశ్చంద్ర నాటకము
7 దక్షిణ గోగ్రహణము
8 వివేకదీపిక

భాషాంతరీకృత నాటకములు

మూడవ సంపుటము

1 చమత్కార రత్నావళి
2 రాగమంజరి
3 కళ్యాణకల్పవల్లి
4 అభిజ్ఞాన శాకుంతలము
5 రత్నావళి
6 మాళవికాగ్నిమిత్రము
7 ప్రబోధచంద్రోదయము
8 వెనీసు వర్తకచరిత్రము

వ చ న ప్ర బం ధ ము లు

ప ద్య కా వ్య ము లు

నాల్గవ సంపుటము

1 సత్యరాజాపూర్వదేశ యాత్రలు మొ॥భా॥
2 ,, రెం॥భా॥
3 రాజశేఖర చరిత్రము
4 శుద్ధాంధ్రనిరోష్ఠ్యనిర్వచననైషధము

5 రసికజనమనోరంజనము
6 శుద్ధాంధ్రభారత సంగ్రహము
7 అభాగ్యోపాఖ్యానము
8 రథిక విలాసము
9 జాన్ గిల్పిన్
10 నీతిదీపిక

స్త్రీలుపయోగించుకథలు

అయిదవ సంపుటము

---

1 సత్యవతీ చరిత్ర
2 చంద్రమతీ చరిత్ర
3 సత్యసంజీవిని
4 చమత్కార రత్నావళి
5 సతీమణి విజయము
6 సుమిత్ర చరిత్రము
7 రఘుదేవ రాజీయము
8 కురంగేశ్వర వర్తక చరిత్రము
9 కళావతి పరిణయము
10 గయ్యాళినిసాధుచేయుట
11 చిత్రకేతు చరిత్రము
12 దానకేసరీవిలాసము
13 వైదర్భీ విలాసము
14 భానుమతీ కళ్యాణము
15 సరసిజనమనోభిరామము
16 ధర్మకవచోపాఖ్యానము
17 కుమారద్వయవిలాసము
18 పద్మినీ ప్రభాకరము
19 మాలతీ మధుకరము
20 స్త్రీ పునర్వివాహవిషయకోపన్యాసము
21 స్త్రీపునర్వివాహవిషయక ప్రథమవిజ్ఞాపనము
22 స్త్రీపునర్వివాహవిషయక ద్వితీయవిజ్ఞాపనము
23 స్త్రీపునర్వివాహశాస్త్ర సంగ్రహము
24 స్త్రీపునర్వివాహభూతవర్త మానస్థితులు

స్త్రీలుపయోగించుపుస్తకములు

ఆఱవ సంపుటము

---

1 శ్రీవిక్టోరియా మహారాజ్ఞి చరిత్రము
2 సతీహితబోధిని
3 పత్నీహిత సూచని
4 స్త్రీనీతిదీపిక
5 సత్యాద్రౌపదీసంవాదము మాతృపూజ పితృపూజ
6 నీతికథామంజరి ప్రథమభాగము
7 డిటో ద్వితీయభాగము
8 దేహారోగ్యధర్మబోధిని ఉపన్యాసములు

ఏడవ సంపుటము

---

1 జన్మాంతరము

2 అతిబాల్య వివాహము
3 విగ్రహారాధనము
4 ఈశ్వరదత్త పుస్తకములు
5 ఈశ్వరోపాసనము
6 ప్రార్థన
7 మానుషధర్మము
8 విద్యార్థుల ధర్మములు
మనుష్యజీవితముల యొక్క పరమార్థము
10 వైరాగ్యము
11 విద్యాధురీణుల యర్హ కృత్యములు
12 వర్ణము
13 హిందూమతములు
14 స్వయంకృషి
15 సకాయకష్టకర్మలు
16 వేశ్య కాంతల ఉపన్యాసములు
17 ఐకమత్యము
18 దానములు
19 స్త్రీపునర్వివాహచరిత్రము

ఉపన్యాసములు—జీవచరిత్రలు

ఎనిమిదవ సంపుటము

1 దేశీయమహాసభ, దానియుద్దేశము
2 శంకరాచార్యులు
3 బసవరాజు గవర్రాజుగారి జీవచరిత్రము
4 జీసస్ చరిత్రము
5 స్వదేశసంస్థాన చరిత్రాదులు
6 విగ్రహతంత్రవిమర్శనము
7 ఉపన్యాసమంజరి
8 వివేకవర్ధని మొదటిభాగము
9 ,, రెండవభాగము
10 ,, మూడవభాగము

సాహిత్యగ్రంథములు

తొమ్మిదవ సంపుటము

1 సంగ్రహ వ్యాకరణము
2 కావ్యసంగ్రహము
3 అలంకార సంగ్రహము
4 నీతిచంద్రిక-విగ్రహము
5 నీతిచంద్రిక-సంధి
6 తర్కసంగ్రహము
7 సత్యవాదిని
8 ఉత్తమస్త్రీచరిత్రములు

పూర్వాంధ్రకవులు

పదియవ సంపుటము

ఆధునికాంధ్రకవులు

పదకొండవ సంపుటము

స్వీయచరిత్ర

పుస్తకములు వలయువారు:-

కార్యదర్శి, హితకారిణీ సమాజము, రాజమహేంద్రవరము.

అని వ్రాసిన బడ[illegible]ను.